
JORDAR NEWS
తెలంగాణ & ఆంధ్రప్రదేశ్
రెండు తెలుగు రాష్ట్రాల్లో ఖాళీగా ఉన్న మండలాలు, నియోజకవర్గాలు, జిల్లాల్లో జోర్దార్ దినపత్రికలో పనిచేయుటకు మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్లు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి.
9848811424

RNI NO.TGTEL/25/A5224
# జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం


JORDAR NEWS
తెలంగాణ & ఆంధ్రప్రదేశ్
రెండు తెలుగు రాష్ట్రాల్లో ఖాళీగా ఉన్న మండలాలు, నియోజకవర్గాలు, జిల్లాల్లో జోర్దార్ దినపత్రికలో పనిచేయుటకు మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్లు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి.
9848811424

కరీంనగర్ సంపుటి : 01 సంచిక : 274 గురువారం, అక్టోబర్ 22 2026, పేజీలు - 8 వెల : 2/- epaper.jordar.com

## ధూప దీప నైవేద్యంలో అక్రమాలకు చెక్..
# అర్చకులపై మరింత వేటు!

- **థర్డ్ పార్టీ విచారణలో 2 వేలకుపైగా ఆలయాలపై అభ్యంతరాలు..**
- **వెయ్యికిపైగా సాఫ్ట్వేర్ ఉద్యోగుల వ్యవహారంపై ప్రశ్నలు**




**హైదరాబాద్ జోర్దార్ నిఘా విభాగం**
తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ధూప దీప నైవేద్య పథకం అమలుపై ప్రభుత్వం దృష్టి సారించిన నేపథ్యంలో ఆలయాల నిర్వహణ, అర్చకుల విధులు, పథకం నిధుల వినియోగంపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పథకం కింద ఉన్న ఆలయాలపై నిర్వహించిన థర్డ్ పార్టీ విచారణలో రెండు వేలకుపైగా ఆలయాల్లో పలు లోపాలు ఉన్నట్లు తేలినట్లు సమాచారం. దీంతో విధులు సక్రమంగా నిర్వహించని అర్చకులపై మరింత కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందన్న చర్చ మొదలైంది.
గతంలోనే కొన్ని ఆలయాల్లో అర్చకులు క్రమం తప్పకుండా విధులకు హాజరు కావడం లేదని, వారి స్థానంలో సాఫ్ట్వేర్ ఉద్యోగులు కొనసాగుతున్నారనే ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. తాజాగా ఇలాంటి సాఫ్ట్వేర్ ఉద్యోగులు వెయ్యికిపైగా ఉన్నట్లు సమాచారం రావడంతో దేవాదాయ శాఖ వ్యవహారశైలిపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆరోపణలు వెలువడుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**విచారణతో వెలుగులోకి వాస్తవాలు**
థర్డ్ పార్టీ విచారణలో ఆలయాల వాస్తవ పరిస్థితులపై పలు అంశాలు వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. అర్చకులు ఆలయాలకు క్రమం తప్పకుండా వెళ్తున్నారా? నిత్య పూజలు, ధూప దీప నైవేద్య కార్యక్రమాలు జరుగుతున్నాయా? పథకం కింద ప్రభుత్వం అందిస్తున్న నిధులు నిబంధనల ప్రకారం వినియోగిస్తున్నారా? అనే అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాల్సిన అవసరం ఉందని భక్తులు కోరుతున్నారు. ప్రత్యేకంగా గుట్టలపై, గ్రామాలకు దూరంగా, ఊరి బయట ఉన్న ఆలయాల్లో అర్చకుల హాజరుపై మరింత నిఘా పెట్టాలని స్థానికులు కోరుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఆలయాలకు అర్చకులు సక్రమంగా వెళ్లడం లేదని గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం.

**సాఫ్ట్వేర్ ఉద్యోగుల వ్యవహారంపై చర్యలెప్పుడు?**
అర్చకుల స్థానంలో సాఫ్ట్వేర్ ఉద్యోగులు కొనసాగుతున్నారనే ఆరోపణలు కొత్తవి కావని పలువురు పేర్కొంటున్నారు. ఈ వ్యవహారంపై గతంలోనే పలు సందర్భాల్లో ఫిర్యాదులు, కథనాలు వెలువడినా పూర్తిస్థాయిలో చర్యలు కనిపించలేదనే విమర్శలు ఉన్నాయి. ఇప్పుడు థర్డ్ పార్టీ విచారణ నేపథ్యంలో అనర్హులు ఎవరైనా ఉంటే వారిని గుర్తించి నిబంధనల ప్రకారం తొలగించాలని, అర్హులైన వారికి మాత్రమే బాధ్యతలు అప్పగించాలని డిమాండ్ చేస్తున్నారు.

**ఆలయ భూములపైనా దృష్టి పెట్టాలి**
ధూప దీప నైవేద్య పథకం కింద ఉన్న ఆలయాల నిర్వహణతో పాటు వాటికి సంబంధించిన భూములు, ఆస్తులపై కూడా ప్రభుత్వం సమగ్ర పరిశీలన చేపట్టాలని భక్తులు కోరుతున్నారు. కొన్ని ఆలయాలకు ఎకరాల కొద్దీ భూములు ఉన్నప్పటికీ అవి అన్యాక్రాంతమవుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరికొన్ని ఆలయాలకు భూములు ఉన్నప్పటికీ రికార్డుల్లో సక్రమంగా నమోదు కాలేదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ఆలయానికి ఉన్న భూములు ఎంత? ప్రస్తుతం ఎవరి ఆధీనంలో ఉన్నాయి? వాటి నుంచి ఆదాయం వస్తుందా? వస్తే అది ఆలయ అవసరాలకు వినియోగిస్తున్నారా? అనే అంశాలపై ప్రత్యేక సర్వే నిర్వహించాలని కోరుతున్నారు.

**అర్హులకు అవకాశం కల్పించాలి**
ధూప దీప నైవేద్య పథకం ఉద్దేశం నెరవేరాలంటే పనిచేయని అర్చకులను గుర్తించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, అర్హత కలిగిన అర్చకులకు అవకాశం కల్పించాలని పలువురు కోరుతున్నారు. అర్చకులకు వారి విధులు, బాధ్యతలు, హాజరు, పథకం నిబంధనలపై ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచిస్తున్నారు. ముఖ్యమ ంత్రి రేవంత్‌రెడ్డి ఆలయాల వ్యవహారంపై ప్రత్యేక దృష్టి సారించి, అర్హత కలిగిన ఆలయాలను దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిధిలోకి తీసుకురావడంతో పాటు ఆలయాల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు. థర్డ్ పార్టీ విచారణలో వెలుగులోకి వచ్చిన అంశాలపై క్షేత్రస్థాయిలో మరోసారి సమగ్ర పరిశీలన జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఏపీ మున్సిపల్ ఎన్నికలు

**: ఎస్ఈసీకి సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు, అభ్యర్థుల జాబితా వాయిదా**



**అమరావతి:** ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా నామినేషన్ల గడువును పొడిగించేందుకు నిరాకరించిన ధర్మాసనం, వైసీపీ ఫిర్యాదు చేసిన నిర్దిష్ట ప్రాంతాల్లో మా త్రం పరిశీలన జరపాలని రాష్ట్ర ఎన్నికల సం ఘాన్ని (ఎస్ఈసీ) ఆదేశించింది. దీంతో పాటు, అభ్యర్థుల తుది జాబితా ప్రకటనను అక్టోబర్ 25వ తేదీకి వాయిదా వేసింది. తమ అభ్యర్థు లను 19 చోట్ల నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారని, హింసకు పాల్పడ్డారని ఆరోపిస్తూ వైసీపీ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ జరిపింది. స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలు రాజ్యాంగ మౌలిక స్వరూపంలో భాగమని, ఈ ప్రక్రియకు విఘాతం కలుగుతుంటే రాజ్యాంగ కోర్టులు మౌ నంగా ఉండలేవని ఈ సందర్భంగా ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఫిర్యాదులు అందిన ప్రాంతాల్లో వాటిని పరిశీలించి, నామినేషన్ల స్వీకరణకు అవకాశం కల్పించాలా వద్దా అనే దానిపై రేపటి లోగా నిర్ణయం తీసుకోవాలని ఎస్ఈసీని ఆదేశించింది. అవసరమైతే జిల్లా కలెక్టర్ ఎదుట నామినేషన్లు వేసే అవకాశం కల్పించాలని సూచించింది. ఈ వ్యవహారంలో తీసుకున్న చర్యలపై అక్టోబర్ 27న తమకు నివేదిక సమర్పించాలని సుప్రీంకోర్టు ఎస్ఈసీని ఆదేశిస్తూ, తదుపరి విచారణను అదే రోజుకు వాయిదా వేసింది. ఇప్పుడు అందరి దృష్టి రాష్ట్ర ఎన్నికల సంఘం తీసుకోబోయే నిర్ణయంపైనే కేంద్రీకృతమైంది.

## ఏపీలో వైసీపీకి భారీ షాక్..
# టీడీపీలోకి భారీ వలసలు




**పాలకొల్లు, అక్టోబర్ 21:**
పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. మంత్రి నిమ్మల రామానాయుడు సమక్షంలో చింతపర్రు గ్రామానికి చెందిన సుమారు 200 మంది వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. గ్రామానికి చెందిన పలువురు కీలక వైసీపీ నేతలు కూడా పార్టీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. మంత్రి నిమ్మల రామానా యుడు వారికి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు.. సంక్షేమ పథకాలతో పాటు మంత్రి నిమ్మల రామానాయుడు పనితీరుపై విశ్వాసంతోనే తాము టీడీపీలో చేరినట్లు వారు వెల్లడించారు. కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ చేపడుతున్న కార్యక్రమాలు ప్రజల్లో ఆదరణ పొందుతున్నాయని టీడీపీ శ్రేణులు పేర్కొన్నాయి. వైసీపీ నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు.. కీలక నాయకులు టీడీపీలో చేరడం నియోజకవర్గ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఆత్మకూరు మున్సిపాలిటీలో వైఎస్సాం సీపీకి ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీకి చెందిన 60 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వైసీపీని వీడి టీడీపీలో చేరిన వారికి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అభ్యర్థులకు మంత్రి బీఫామ్ పత్రాలను అందజేశారు.

# పీఏలదే రాజ్యం.. బాసుల పేరుతో 'రేట్ల' బాగోతం!

- **మంత్రులు, ఎమ్మెల్యేల పేరుతో హవా..**
- **అపాయింట్‌మెంట్ నుంచి సిఫారసు లేఖల వరకు వసూళ్ల ఆరోపణలు**




**జోర్దార్, తెలంగాణ బ్యూరో:**
ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన కొందరు మంత్రులు, ఎమ్మెల్యేల కార్యాలయాల్లో పీఏల పెత్తనం పెరిగిపోయిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజాప్రతినిధులను కలవాలన్నా, సమస్య చెప్పుకోవాలన్నా, ఏదైనా సిఫారసు లేఖ కావాలన్నా ముందుగా పీఏలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందని పలువురు వాపోతున్నారు. ఇదే అదనుగా కొందరు పీఏలు తమ బాసుల పేర్లను అడ్డం పెట్టుకుని వివిధ పనులకు 'రేట్లు' నిర్ణయించి వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు రాజకీయ, అధికార వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. మంత్రులు, ఎమ్మెల్యేలను నేరుగా కలవడం కష్టంగా ఉండటంతో ముందుగా పీఏలను సంప్రదించాల్సి వస్తోందని, అక్కడే అసలు వ్యవహారం మొదలవుతోందని విమర్శలు ఉన్నాయి. అపాయింట్‌మెంట్ ఇప్పించడం, సిఫారసు లేఖలు ఇవ్వడం, అధికారులకు ఫోన్ చేయించడం వంటి పనులకు ఒక్కో రేటు నిర్ణయించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అపాయింట్‌మెంట్‌కు రూ. 10 వేల వరకు, సిఫారసు లేఖలకు రూ. 20 వేల వరకు డిమాండ్ చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. టీటీడీ దర్శన సిఫారసు లేఖలు, సీఎంఆర్ఎఫ్ దరఖాస్తులు, ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లు, గురుకులాల్లో సీట్లు, కళాశాల ఫీజు తగ్గింపు వంటి వ్యవహారాల్లోనూ డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొన్ని పనులకు నిర్ణీత మొత్తం, మరికొన్ని వ్యవహారాల్లో మంజూరయ్యే ప్రయోజనానికి అనుగుణంగా శాతం చొప్పున డిమాండ్ చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పోలీస్, రెవెన్యూ శాఖల్లోని వ్యవహారాల్లోనూ కొందరు పీఏల జోక్యం పెరిగిందనే ఆరోపణలు ఉన్నాయి. సీఐ, తహసీల్దార్ వంటి కీలక పోస్టింగుల విషయంలో సిఫారసు లేఖలు ఇప్పించేందుకు భారీ మొత్తాలు డిమాండ్ చేస్తున్నారని, ఎక్సైజ్ శాఖ పోస్టింగుల విషయంలోనూ ఇదే తరహా ఆరోపణలు ఉన్నాయని ప్రచారం జరుగుతోంది. పోలీసు కేసుల విషయంలో సీఐకి ఫోన్ చేయడం, డీఎస్పీ, ఎస్పీ స్థాయి అధికారులతో మాట్లాడిస్తామని చెప్పి డబ్బులు తీసుకుంటున్నారనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. డబ్బులు ఇచ్చే వారికి కార్యాలయాల్లో ప్రత్యేక ప్రాధాన్యత లభిస్తుండగా, సాధారణ ప్రజలు మాత్రం గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంత్రి లేదా ఎమ్మెల్యే ఎక్కడ ఉన్నారు? ఎప్పుడు వస్తారు? ఎప్పుడు కలిసే అవకాశం ఉంటుంది? ఏ కార్యక్రమానికి వెళ్తున్నారు? వంటి సమాచారాన్ని సైతం పీఏలే నియంత్రిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అడిగినంత ఇచ్చే వారికి రాచమర్యాదలు, మిగతా వారికి నిరీక్షణ తప్పడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక అసలు ప్రశ్న మంత్రులు, ఎమ్మెల్యేలకే ఈ వ్యవహారాల గురించి ఎంతవరకు తెలుసన్నదే. తమ పేర్లను ఉపయోగించుకుని ఎవరైనా అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారా? లేక ఈ వ్యవహారాలు వారి దృష్టికి వచ్చినా పట్టించుకోవడం లేదా? అన్నది తేలాల్సి ఉంది. కొన్ని సందర్భాల్లో పీఏలపై ఫిర్యాదులు వచ్చినా మందలించి వదిలేస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. పీఏల వ్యవహారశైలి వల్ల ప్రజాప్రతినిధుల ప్రతిష్ట దెబ్బతింటోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజల సమస్యలు వినేందుకు, ప్రభుత్వ పథకాలు అందించేందుకు ఉండాల్సిన ప్రజాప్రతినిధుల కార్యాలయాలు మధ్యవర్తిత్వానికి, వసూళ్లకు వేదికలుగా మారుతున్నాయన్న ఆరోపణలు నిజమైతే ఇది తీవ్రంగా పరిగణించాల్సిన అంశం. మంత్రులు, ఎమ్మెల్యేల పేర్లను ఉపయోగించి డబ్బులు వసూలు చేస్తున్నది ఎవరు? ఈ వ్యవహారాల వెనుక ఎవరి అండ ఉంది? అధికారులపై ప్రభావం చూపుతున్నది ఎవరు? అనే విషయాలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను బయటపెట్టాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

## 'జాతీయ భద్రతను పరిరక్షించడంలో
# కేంద్రం విఫలం'

**- మణిపూర్ హింసాకాండపై కాంగ్రెస్**

**మణిపూర్:** మణిపూర్‌లో కొనసాగుతున్న హింసాకాండపై కాంగ్రెస్ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేసింది. వ్యూహాత్మకంగా కీలకమైన సరిహద్దు రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడటంలో, రాజ్యాంగ హక్కులను పరిరక్షించడంలో, జాతీయ భద్రతను రక్షించడంలో బీజేపీ విఫలమైందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆరోపించారు. ఇటీవల నలుగురు అమాయక పౌరులు హత్యకు గురికావడంపై ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మే 2023 నుంచి ఇప్పటివరకు 300 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా, 24,530 మంది సహాయక శిబిరాల్లో దయనీయ పరిస్థితుల్లో జీవిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో శాంతిని పునరుద్ధరించేందుకు కేంద్రం తీసుకున్న చర్యలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మణిపూర్‌లో ఇటీవల జరిగిన హింసాకాండలో నలుగురు అమాయక పౌరులు దారుణంగా హత్యకు గురికావడాన్ని ఖర్గే ఖండించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బీజేపీ అసమర్థత వల్లే రాష్ట్రం మళ్లీ రక్తసిక్తమవుతోందని 'ఎక్స్' వేదికగా విమర్శించారు. మే 2023లో లోయ ప్రాంతానికి చెందిన మైతీ



# పెన్షనర్ల హెల్త్ కార్డుల సమస్యలు పరిష్కరించాలి

**హైదరాబాద్,జోర్దార్ ప్రతినిధి:**పెన్షనర్ల హెల్త్ కార్డుల అప్‌లోడింగ్, డౌన్‌లోడింగ్‌లో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని టీఎస్‌జీఆర్‌ఈఏ ప్రతినిధి బృందం ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ డైరెక్టర్‌ను కోరింది. డిపెండెంట్ల వివరాలు అప్‌లోడ్ కాకపోవడం, పెన్షన్ వివరాల ధ్రువీకరణ అనంతరం కూడా కార్డులు డౌన్‌లోడ్ కాకపోవడం, ఫొటోలు సరిపోలకపోవడం వంటి సమస్యలతో పెన్షనర్లు ఇబ్బందులు పడుతున్నారని తెలిపింది. అర్హులైన పెన్షనర్లు, వారి డిపెండెంట్లకు హెల్త్ కార్డులు సులభంగా అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు



పేరి వెంకట్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఉస్మాన్ పాషా, ఆర్థిక కార్యదర్శి బి.ప్రహ్లాద రావు పాల్గొన్నారు.

# హుజూరాబాద్‌లో ఘనంగా విజయదశమి వేడుకలు

■ అంగరంగ వైభవంగా రావణ వధ

**హుజూరాబాద్,జోర్దార్ ప్రతినిధి:**హుజూరాబాద్ పట్టణంలోని హైస్కూల్ గ్రౌండ్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని మనోజ్ రావు ఆధ్వర్యంలో విజయదశమి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శమీ పూజతో పాటు రావణ వధ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ సుహాసిని మాట్లాడుతూ.. విజయదశమి చెడుపై మంచి,అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి ప్రతీక అని పేర్కొన్నారు. రావణుడిపై శ్రీరాముడి విజయం, మహిషాసురుడిపై అమ్మవారి విజయం సమాజానికి గొప్ప సందేశాన్ని అందిస్తాయని, ధర్మం, సత్యం ఎప్పటికైనా విజయం సాధిస్తాయని అన్నారు. విజయదశమి



వేడుకలను విజయవంతంగా నిర్వహించడంలో రాంలీలా కమిటీ సభ్యులు చేసిన సేవలు మరు



వలేనివని ఆమె కొనియాడారు.
ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కిషన్, ఏసీపీ మాధవి, కరుణాకర్,వైస్ చైర్‌పర్సన్ అంజలి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు,రాంలీలా కమిటీ అధ్యక్షుడు బుర్ర నటరాజ్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ విష్ణుదాసు గోపాల్ రావు, ఉపాధ్యక్షుడు కన్నన్ దుర్రైరాజ్ స్వామి, కోశాధికారులు భూసారపు శ్రీనివాస్, నల్లగోని రాకేష్, సహాయ కార్యదర్శులు అయిత మేకల మల్లేష్, కొమురవెల్లి సురేష్, పంజాల సందీప్, కొమురవెల్లి సతీష్, కమిటీ సభ్యులు, పాలకుర్తి రాజేందర్ ఆర్కెస్ట్రా టీం, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ఏసిపి మాధవి, టౌన్ సిఐ కరుణాకర్, పోలీస్, సిబ్బంది, మున్సిపల్,
కౌన్సిలర్స్, కోఆప్షన్ సభ్యులు, విద్యుత్ సిబ్బంది, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు,ప్రజలు పాల్గొన్నారు.

# దసరా వేడుకల విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు

**హుజూరాబాద్,జోర్దార్ ప్రతినిధి:**హుజూరాబాద్ పట్టణంలో విజయదశమి వేడుకలను విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన ప్రజలకు, దసరా ఉత్సవ సమితి సభ్యులకు మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని మనోజ్ రావు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.
వేడుకల నిర్వహణకు సహకరించిన మున్సిపల్ అధికారులు, సిబ్బంది, పోలీస్, విద్యుత్ శాఖల సిబ్బంది, ప్రజాప్రతినిధులు, రామలీలా కమిటీ, మీడియా మిత్రులు, కళాకారులు,పట్టణ ప్రజల సమిష్టి కృషితోనే వేడుకలు ఘనంగా జరిగాయని ఆమె పేర్కొన్నారు. పట్టణంలో ఐక్యత, సోదరభావం, సంప్రదాయాలు కొనసాగాలని



ఆకాంక్షించారు.

# బౌద్ధ ధర్మంతోనే ప్రపంచ శాంతి

■ అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మధుపాక ఎల్లయ్య

**హనుమకొండ,జోర్దార్ ప్రతినిధి:**స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, మానవీయ విలువలు కలిగిన బౌద్ధ ధర్మాన్ని ఆచరించడం ద్వారానే ప్రపంచ శాంతి సాధ్యమని తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మధుపాక ఎల్లయ్య అన్నారు.
అశోక విజయదశమి సందర్భంగా మంగళవారం హనుమకొండ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ బౌద్ధ ఆరామంలో నిర్వహించిన ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అమితమైన కోరికలే మనిషి దుఃఖానికి కారణమని గౌతమ బుద్ధుడు బోధించారని, కరుణ, సమానత్వం, మానవీయ విలువలను పాటించినప్పుడే సమాజంలో శాంతి నెలకొంటుందని పేర్కొన్నారు. బౌద్ధ ధర్మాన్ని ప్రతి ఒక్కరూ ఆచరించినప్పుడే సమసమాజ స్థాపన సాధ్యమవుతుందని అన్నారు. ఆల్ ఇండియా




ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్ మాట్లాడుతూ అశోక విజయదశమి ప్రాధాన్యాన్ని ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్ అన్నారు. కళింగ యుద్ధంలో జరిగిన రక్తపాతాన్ని చూసి చలించిపోయిన అశోకుడు బౌద్ధ ధర్మాన్ని స్వీకరించి అహింస, కరుణ, శాంతి మార్గాన్ని అనుసరించారని వివరించారు. అదే స్ఫూర్తితో అంబేద్కర్ 1956 అక్టోబర్ 14న నాగ్‌పూర్ దీక్షాభూమిలో లక్షలాది మందితో కలిసి బౌద్ధ ధర్మాన్ని స్వీకరించారని గుర్తుచేశారు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి విలువలు భారత రాజ్యాంగంలోనూ ప్రతిబింబించాయని అన్నారు. యుద్ధం ద్వారా శాంతి సాధ్యం కాదని, ప్రేమ, ఆప్యాయత, స్నేహం, సమానత్వంతోనే సమాజంలో శాంతిని నెలకొల్పగలమని పేర్కొన్నారు. బౌద్ధ ధర్మం, అంబేద్కర్ రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడినప్పుడే ప్రజాస్వామ్యం బలోపేతమై సమసమాజం ఏర్పడుతుందని అన్నారు.
ఈ కార్యక్రమంలో ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకురాలు జన్ను పద్మ, మాదిగ జాంబవ జాగృతి సంఘం నాయకుడు బొల్లె సాంబయ్య, షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఏనుట్ల రవీందర్, ఉపాధ్యక్షుడు ఎర్ర శోభన్ బాబు, ప్రధాన కార్యదర్శి బంగారు బాబు, డీఎస్పీ నాయకులు మేకల సుమన్, సురేష్, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా నాయకులు బూజు గుండ్ల శ్రీనివాస్, జిల్లా కోశాధికారి మంత్రి చాణిక్యతో పాటు వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# పోలీస్

దేశానికి సరిహద్దుల్లో సైనికుడిలా
రేయింబవళ్ళు కంటికి రెప్పలా కాపాడే వారే పోలీస్
తినడానికి తిండి
కంటినిండా నిద్ర
లేకపోయిన
అందరికీ భోజనాలు ప్రశాంతమైన నిద్ర పోయేలా చేసేది పోలీస్
అవినీతి ని అంతమొందించి
దాడులు దౌర్జన్యాలను నివారించి
రౌడీయిజం గుండాయిజం
దోపిడి దొంగతనాలను
కూకటి వేళ్లతో పేకలించేది పోలిస్
ప్రమాదాలను అరికట్టి
ట్రాఫిక్ ఇబ్బందులను నివారించి
శాంతి భద్రతలను కాపాడుతూ
మనల్ని రక్షించే రక్షకభటులు
మార్చురీ దగ్గర
బర్నింగ్ రూం ల వద్ద
ప్రమాదం జరిగి రక్తం కారుతున్న
గొడవలో తలలు పగులగొట్టుకున్న
హాస్పిటల్ లకు తీసుకుపోయేది పోలీస్
రాజకీయ నాయకులకు అడుగడుగునా రక్షణ కవచం గా నిలబడి
ఇరవై నాలుగు గంటల సమయం ఇవ్వండి
నరమేధం సృష్టిస్తా అని ఉపన్యాసాలను వింటూ
రాజకీయ నాయకుల ఒత్తిడి లో నలిగి పోతూ
స్వేచ్ఛ స్వాతంత్ర్యం లేకపోయిన అందరితో
కలివిడిగా ఉండే ఫ్రెండ్లీ పోలీస్
అధికారం లో ఉన్న
నాయకుల మాటలు విని ప్రతిపక్షం లో ఉన్నప్పుడు అరెస్టు చేశారని పగతో ప్రతీకారంతో ప్రతిపక్షం నుండి అధికారంలోకి రాగానే పోస్టింగ్ ఇవ్వకుండా వేధింపులకు గురి చేసిన ఉద్యమాలు పోరాటాల జోలికి పోకుండా న్యాయస్థానంపై సంపూర్ణ విశ్వాసంతో సంవత్సరాల తరబడి
కోర్టుల చుట్టూ తిరిగే ఓపిక మంతులు పోలీస్
పోలీస్ అధికారుల సంఘం ఉన్న పోరు చేయకుండా
ఉద్యోగ ఉపాధ్యాయుల కార్మిక కర్షక విద్యార్థి యువజన అధికార ప్రతిపక్ష పార్టీలు చేసే ఆందోళన నిరసన కార్యక్రమాలను నివారించేది పోలిస్
ఈవ్ టీజింగ్ సైబర్ నేరాలను
తీవ్రవాదులకు నకిలీ వ్యాపారస్తులకు గుడుంబా గంజాయి మత్తు పదార్థాలు విక్రయించే వారికి సింహస్వప్నం పోలీస్
పోలీసులు మనకు రక్షణ కల్పించే రక్షకభటులు
వారికి సహాయ సహకారాలు అందించి శాంతి భద్రతలను కాపాడటం లో వారు యూనిఫాం లో ఉన్న పోలీసులైతే
మనం యూనిఫాం లేని పోలీసులుగా మన కర్తవ్యం నిర్వహిద్దాం!



డాక్టర్. ఎస్. విజయ భాస్కర్,
అధ్యక్షులు,మహాజన రచయితల సమాఖ్య
రాష్ట్ర కమిటీ, సైదాబాద్, హైదరాబాద్.

# పండుగ సాయన్న జయంతి సభను అడ్డుకోవడం ముదిరాజుల ఆత్మగౌరవానికి అవమానం

■ కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు కొలిపాక సమ్మయ్య

**హుజురాబాద్,జోర్దార్ ప్రతినిధి:**హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో అక్టోబర్ 22న నిర్వహించనున్న పండుగ సాయన్న జయంతి సభను అడ్డుకుంటామనడం ముదిరాజులఆత్మగౌరవాన్ని అవమానించడమేనని ముదిరాజ్ మహాసభ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు కొలిపాక సమ్మయ్య అన్నారు. తెలంగాణ ముదిరాజ్ జేఏసీ వైఖరిని ఆయన తీవ్రంగా ఖండించారు. పండుగ సాయన్న తెలంగాణ రాబిన్‌హుడ్‌గా పేరొందారని, పేదల ఆకలి తీర్చి, అన్యాయంపై పోరాడిన వీరుడిగా చరిత్రలో నిలిచారని పేర్కొన్నారు. ఆయన జయంతి సభను అడ్డుకోవాలని చూడటం సరికాదన్నారు. ముదిరాజుల అభివృద్ధి, హక్కుల సాధన కోసం సంఘాలు కృషి చేయాలని, స్వార్థ రాజకీయాల కోసం కులంలో విభేదాలు సృష్టించవద్దని సూచించారు. ముదిరాజ్ విద్యావంతులు, యువత,



మేధావులు, ఉద్యోగులు ఐక్యంగా ఉండి పండుగ సాయన్న జయంతి వేడుకలను రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని సమ్మయ్య పిలుపునిచ్చారు.

# టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేసిన డీఎంహెచ్ఓ



**హనుమకొండ,జోర్దార్ ప్రతినిధి:**హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ అప్పయ్య రాయపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వెల్లంపల్లి, సీతారాంపూర్ గ్రామాల్లో నిర్వహిస్తున్న రొటీన్ ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. చిన్నారులకు నిర్ణీత షెడ్యూల్ ప్రకారం టీకాలు అందుతున్నాయా అని పరిశీలించి, అర్హులైన పిల్లలందరికీ పూర్తిస్థాయిలో టీకాలు వేయాలని వైద్య సిబ్బందికి సూచించారు.
అనంతరం త్వరలో ప్రారంభించనున్న నడికూడ నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వైద్య పరికరాలు, ఇతర సామగ్రి తరలింపు ప్రక్రియను పరిశీలించారు. ప్రారంభానికి అవసరమైన ఏర్పాట్లను త్వరగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల సమ్మె కొనసాగుతున్నప్పటికీ ప్రజలకు వైద్య సేవల్లో అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో సేవలు కొనసాగిస్తున్నామని డాక్టర్ అప్పయ్య తెలిపారు. టీకాల కార్యక్రమంతో పాటు అన్ని ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని సిబ్బందికి సూచించారు.

# చెడుపై మంచి, అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి ప్రతీక దసరా పండగ




■ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి.

**బెల్లంపల్లి జోర్దార్ ప్రతినిధి:**చెడుపై మంచి, అధర్మంపై ధర్మం, సాధించిన విజయానికి ప్రతీకగా చేసుకునేదే దసరా పండుగని, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు.
విజయదశమి, దసరా పండుగ సందర్భంగా స్థానిక తిలక్ స్టేడియంలో హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రావణాసుర వద కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి సతీమణి గడ్డం సరోజ,తో కలిసి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు,
హిందూ ధర్మాన్ని కాపాడేందుకు స్థానిక హిందూ ఉత్సవ సమితి ప్రతినిధులు ప్రతి సంవత్సరం చేస్తున్న ఈ కార్యక్రమం ప్రజలకు ఎంతో ఉత్సాహాన్ని ఇస్తుందని నిర్వాహకులను అభినందించారు.
ప్రజా పాలన ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజలకు సంబంధించిన అన్ని సమస్యలను తీర్చేందుకు కృషి చేస్తుందని, స్థానికంగా తాను నెలకొల్పిన టామ్ కామ్ సంస్థ ద్వారా నిరుద్యోగ నర్సింగ్ అభ్యర్థులకు జపనీస్ భాషను నేర్పించడంతోపాటు, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు పాటుపడుతుందని, బెల్లంపల్లిలో సైతం అర్హులైన వారు వారి జాబితాను తయారుచేసి అందిస్తే వారికి శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గడ్డం వినోద్, మున్సిపల్ చైర్పర్సన్ దావ స్వాతి రమేష్ బాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ సుకుమారి, మున్సిపల్ కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివి



■ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

**హనుమకొండ,జోర్దార్ ప్రతినిధి:**దేశ రక్షణ, ప్రజల భద్రత కోసం విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలు చిరస్మరణీయమని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా హనుమ కొండలో నిర్వహించిన పోలీసు ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. హనుమకొండ చౌరస్తా నుంచి పోలీస్ హెడ్‌క్వార్టర్స్ వరకు పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి ర్యాలీలో పాల్గొని, అనంతరం అమరవీరుల స్తూపం వద్ద పుష్పగుచ్ఛం సమర్పించి నివాళులర్పించారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణతో పాటు శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు అందిస్తున్న సేవలు ఎంతో విలువైనవని పేర్కొన్నారు. అమరవీరుల త్యాగాలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని, వారి కుటుంబాలకు సమాజం అండగా నిలవాలని పిలుపునిచ్చారు.
ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడమే అమరవీరులకు అర్పించే నిజ మైన నివాళి అని ఎమ్మెల్యే అన్నారు.

# అమ్మ భవాని ఊరేగింపు కార్యక్రమంలో 25వ వార్డు కౌన్సిలర్ కొక్కుల బాలకృష్ణ [రాజు]

**వేములవాడ, జోర్దార్ ప్రతినిధి:** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని మార్కండేయ నగర్ కాలనీ లో అమ్మ భవాని ఊరేగింపులో పాల్గొన్న సందర్భంగా 25వ వార్డులో భక్తిశ్రద్ధలతో నిర్వహించిన అమ్మ భవాని ఊరేగింపు కార్యక్రమంలో 25వ వార్డు కౌన్సిలర్ కొక్కుల బాలకృష్ణ (రాజు) పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందడం జరిగింది.
అమ్మ భవాని కృపాకటాక్షాలు 25వ వార్డు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాము అని కొక్కుల బాలకృష్ణ (రాజు) 25వ వార్డు కౌన్సిలర్ తెలిపారు.



RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం
గురువారం,
అక్టోబర్ 22 2026


# రైళ్లలో స్పీకర్‌లో పాటలు పెడితే

# జరిమానా, జైలు శిక్ష!



**వికారాబాద్,జోర్దార్ పేపర్ ప్రతినిధి:**రైళ్లలో, రైల్వే స్టేషన్లలో మొబైల్ ఫోన్ల స్పీకర్ల ద్వారా పాటలు, వీడియోలు ప్లే చేస్తూ ఇతర ప్రయాణికులకు అసౌకర్యం కలిగించవద్దని రైల్వే శాఖ హెచ్చరించినట్లు సమాచారం. ప్రయాణ సమయంలో ఇతరులకు ఇబ్బంది కలగకుండా ఇయర్‌ఫోన్స్ వినియోగించాలని సూచించింది.

నిబంధనలను ఉల్లంఘిస్తే రూ.1,000 జరిమానా విధించడంతో పాటు, పదేపదే ఉల్లంఘించిన వారికి ఆరు నెలల జైలు శిక్ష లేదా రూ.5,000 జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉందని పేర్కొంది

# ఇదే నేటి భారతం!!

అందరూ ఈ నిజాన్ని రెండు నిమిషాలు సమయం కల్పించుకొని చదవండి!.

గతంలో సంసారం 'చీకట్లోనే' జరిగేది!.
జీవితాలు వెలుగులో ఉండేవి.
నేడు సంసారం వెలుగులోకి వచ్చి,
జీవితాలు చీకట్లో మగ్గుతున్నాయి!.

కప్పుకోవాల్సిన వాటిని చూపిస్తూ, చూపించాల్సిన అందమైన ముఖాన్ని కప్పేస్తున్నారు!.

నాడు కొందరికే మందు, విందు అలవాటు ఉండేవి, నేడు కొందరే వీటికి దూరం!.

నాడు కష్టమొస్తే, కుటుంబంలోని,
పెద్దలు ధైర్యం చెప్పేవారు!.
నేడు కొన్ని కుటుంబాలలో..
కలహాలకు పెద్దలే కారణమౌతున్నారు!.

నాడు తినడానికి శ్రమించి...
సంపాదించే వాళ్ళం!.
నేడు కదల కుండా కూర్చుని సంపాదిస్తూ,
తిన్నది అరగడానికి...
వాకింగ్ అంటూ శ్రమిస్తున్నాం!.

నాడు పండ్లు తిని, పాలు తాగి,
బలంగా ఉండి బోలెడు మంది...
సంతానాన్ని కని పోషించాము!.
ఇప్పుడు సంసారం చేయడానికే,
మందులు మింగుతున్నారు.
ఇంక పిల్లలెక్కడ...? అందుకేగా,
అన్ని చోట్లా...సంతాన సాఫల్య కేంద్రాలు!.

గతంలో అందరూ హార్డ్‌వేర్ ఇంజనీర్లే...
మనసు మాత్రం సాఫ్ట్ గా ఉండేది!.
ఇప్పుడు అంతా 'సాఫ్ట్ వేర్ ఇంజనీర్లే'...
మనసు మాత్రం హార్డ్'గా మారింది!.

అప్పుడు వైద్యుడు ఇల్లిల్లూ తిరిగి,
వైద్యం చేసేవాడు.
అమృతాంజనానికే జబ్బులు తగ్గేవి!.
ఇప్పుడు తలకాయనొప్పికే...
ఇళ్ళమ్ముకునేంత ఖర్చు అవుతోంది!.

నాడు దొంగలు నట్టింట్లో పడి దోచుకెళ్ళేవారు.
నేడు దొంగలు దొరల్లాగా...
'నెట్ ఇంట్లో' దోచేస్తున్నారు!.

ఒకప్పుడు... చదువులేనోడు,
గతిలేక దొంగగా మారేవాడు!.
ఇప్పుడు...దొంగతనాలు చేయడానికే,
కొత్త కోర్సులు చదువు తున్నారు,
సైబరు నేరగాళ్ళు..!!

అప్పుడు అప్పు చేయాలంటే,
తప్పు చేసినట్లు బాధపడే వాళ్ళం!.
ఇప్పుడు క్రెడిటు కార్డు మీద,
అప్పుతో కొనుక్కోడమే...
క్రెడిట్'గా ఫీలౌతున్నాం!.

ఒకప్పుడు పాలు, పెరుగు అమ్మి,
సొమ్ము చేయలేక వాటిని తాగేవాళ్ళం!.
ఇప్పుడు రెడీ మేడ్ చపాతీలు, పొంగలి,
కూరతో సహా కొనుక్కొచ్చుకొని తింటున్నాం!.

చైనా నుండి ఒకనాడు...
పింగాణీ వస్తువు లొచ్చేవి!.
నేడు తినే కంచం నుంచి...
ప్లాస్టిక్ బియ్యం'తో సహా...
అక్కడినుంచే సరఫరా!.

ఇదేనా మనం సాధించిన పురోగతి?,
లేక, మనకు మనం తెచ్చుకున్న అధోగతా?
కొంచెం...ఆలోచించండి!.



**ఏర్వ వెంకటేశం,**
**డిప్యూటీ డైరెక్టర్ రిటైర్డ్,**
**సమాచార శాఖ, తెలంగాణ.**

## పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివి

# ఎస్పీ అఖిల్ మహాజన్



**ఆదిలాబాద్,జోర్దార్ ప్రతినిధి:**దేశ రక్షణ కోసం ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన సంస్మరణ సభలో ఆయన పాల్గొని అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. 1959 అక్టోబర్ 21న లడఖ్‌లోని హాట్ స్ప్రింగ్స్ ప్రాంతంలో చైనా సైన్యంతో జరిగిన పోరులో ప్రాణాలు కోల్పోయిన పది మంది సీఆర్‌పీఎఫ్ జవాన్ల త్యాగానికి గుర్తుగా ప్రతి సంవత్సరం పోలీసు అమరవీరుల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా ఇప్పటి వరకు 36 వేల మందికి పైగా పోలీసులు విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేశారని పేర్కొన్నారు. ప్రజల భద్రత కోసం పోలీసులు ఎల్లప్పుడూ అంకితభావంతో పనిచేస్తున్నారని, వారి సేవలను ప్రతి ఒక్కరూ గుర్తించాలని అన్నారు.

అమరవీరుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# ఉచితాలు వద్దు.. ఉపాధి ముద్దు!

- ప్రజలపై అప్పుల భారం పడకుండా ప్రభుత్వాలు ఆర్థిక క్రమశిక్షణ పాటించాలి



ప్రజలే చైతన్యంతో ముందుకు రావాలి ఇదే సామాజిక, ఆర్థిక వేత్తల సూచన

**ఆదిలాబాద్,జోర్దార్ ప్రతినిధి:**ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా రాజకీయ పార్టీలు పోటీపడి ఉచిత పథకాలను ప్రకటిస్తుండటంతో రాష్ట్రాల ఆర్థిక పరిస్థితిపై భారం పెరుగుతోందని ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల అప్పులు భారీ స్థాయికి చేరిన నేపథ్యంలో ఉచిత పథకాల కంటే ఉపాధి కల్పన, సంపద సృష్టి, అభివృద్ధికి ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇవ్వాలని సూచిస్తున్నారు.అనర్హులకు చేరుతున్న పథకాల ప్రయోజనాలు,కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పేదల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పలు పథకాల్లో అనర్హులు కూడా లబ్ధి పొందుతున్నారనే విమర్శలు ఉన్నాయి. ఆర్థికంగా స్థోమత ఉన్నవారు సైతం ఉచిత పథకాల కోసం ప్రయత్నించడం వల్ల ప్రభుత్వ ఖజానాపై అదనపు భారం పడుతోంది. ఎన్నికల సమయంలో మేనిఫెస్టోల్లో ఉచిత హామీలకు రాజకీయ పార్టీలు పెద్దపీట వేస్తుండగా, ఓటర్లు కూడా తక్షణ ప్రయోజనాలకు ఆకర్షితులవుతున్నారని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. అర్హులైన పేదలకు మాత్రమే పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

**అప్పుల భారం.. అభివృద్ధికి ఆటంకం**

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల అప్పులు రూ.10 లక్షల కోట్లకు మించాయన్న అంచనాల నేపథ్యంలో రాష్ట్రాల ఆర్థిక నిర్వహణపై చర్చ జరుగుతోంది. పెరుగుతున్న అప్పులకు వడ్డీలు చెల్లించడానికే బడ్జెట్‌లో గణనీయమైన నిధులు వెచ్చించాల్సి వస్తోంది. దీంతో సాగునీటి ప్రాజెక్టులు, రహదారులు, ఆసుపత్రులు, పాఠశాలలు వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి నిధుల కేటాయింపుపై ప్రభావం పడే ప్రమాదం ఉంది. ప్రభుత్వాలు అప్పులు తీసుకోవడం తప్పు కాదని, అయితే వాటిని ఉత్పాదక రంగాలు, విద్య, వైద్యం, ఉపాధి కల్పన, ఆస్తుల సృష్టికి వినియోగించి నప్పుడే దీర్ఘకాలిక ప్రయోజనాలు కలుగుతాయని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు.

**రాష్ట్ర అప్పులు.. ప్రజలపైనే భారం**

ప్రభుత్వాలు చేసే అప్పులను రాజకీయ పార్టీలు తమ సొంత నిధులతో చెల్లించవు. వాటి అసలు, వడ్డీల చెల్లింపులకు ప్రజాధనం వినియోగించాల్సి ఉంటుంది. అప్పుల భారం పెరిగితే భవిష్యత్తులో పన్నుల పెంపు, ప్రభుత్వ సేవలకు నిధుల కొరత వంటి పరిణామాలు ఎదురయ్యే అవకాశం ఉంది. చివరకు పరోక్షంగా ఆ భారం ప్రజలపైనే పడుతుంది.అందువల్ల రాజకీయ పార్టీలు రాష్ట్ర ఆదాయానికి అనుగుణంగా పథకాలనురూపొందించాలని, ప్రజలు కూడా తాత్కాలిక ప్రయోజనాల కంటే ఉపాధి, విద్య, వైద్యం, దీర్ఘకాలిక అభివృద్ధికి ప్రాధాన్యతనిచ్చే విధానాలను కోరుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. అవసరమైన వారికి సంక్షేమ పథకాలు అందిస్తూనే, అనవసర వ్యయాలను తగ్గించి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలని పేర్కొంటున్నారు.

## శాంతినగర్‌లో విషాదం..

# పసిరికల వ్యాధితో వ్యక్తి మృతి

**జోగులాంబ గద్వాల్ జోర్దార్ ప్రతినిధి:**

జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్‌కు చెందిన బరిగే రవి పసిరికలు (జాండిస్) వ్యాధి తీవ్రం కావడంతో బుధవారం తెల్లవారుజామున మృతి చెందారు.



మిత్రుడి మృతి పట్ల పలువురు విచారం వ్యక్తం చేశారు.

ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఈ కష్ట సమయంలో ఆ కుటుంబానికి మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు.

# శాంతినగర్‌లో ముగిసిన

# నవదుర్గా నవరాత్రి ఉత్సవాలు



**జోగులాంబ గద్వాల జిల్లా,(జోర్దార్):**అలంపూర్ నియోజకవర్గంలోని వడ్డేపల్లి మండలం శాంతినగర్ పట్టణంలో శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో తొమ్మిది రోజులుగా నిర్వహించిన నవదుర్గా నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. ముగింపు సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మహిళలు, పురుషులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మ వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

దీంతో ఆలయ ప్రాంగణంలో భక్తి వాతావరణం నెలకొంది.

# ఘనంగా దసరా వేడుకలు



- వేడుకల్లో పాల్గొన్న యాప్ టీవీ సీఈవో పాడి ఉదయ్ నందన్ రెడ్డి

**(వీణవంక, జోర్దార్ ప్రతినిధి)**కరీంనగర్ జిల్లా వీణవంక మండల కేంద్రంలో యాప్ టీవీ సీఈవో పాడి ఉదయ్ నందన్ రెడ్డి స్వగ్రామంలో దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితుడు సతీష్ శర్మ వేదమంత్రాల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించి, కొబ్బరికాయలు కొట్టారు. చెడుపై మంచి విజయం సాధించిన సందర్భంగా దసరా వేడుకలు జరుపుకోవడం జరుగుతుందని గ్రామ ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలియజేశారు,

గ్రామ ప్రజలు ఆయురారోగ్యాలతో, పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని, ప్రతి ఒక్కరూ చేపట్టిన పనుల్లో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

అనంతరం విద్యార్థులకు కృత్రిమ మేధ (ఏఐ) ప్రాధాన్యాన్ని వివరించిన పాడి ఉదయ్ నందన్ రెడ్డి, భవిష్యత్తులో ఏఐ సాంకేతికత ద్వారా పిల్లలకు పాఠాలు బోధించే అవకాశాలు, విద్యారంగంలో రానున్న మార్పుల గురించి వివరించారు. ఏఐపై విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు అందిస్తూ, ఈ సాంకేతికత భవిష్యత్తులో ఎలా ఉపయోగపడుతుందో తెలియజేశారు.

# సంబరాలకు భిన్నంగా సేవా కార్యక్రమం

## రాజా కార్తికేయన్ గౌడ్ జన్మదిన వేడుకలు



**హనుమకొండ జోర్దార్ ప్రతినిధి:**రాజా కార్తికేయన్ గౌడ్ జన్మదినాన్ని పురస్కరించుకుని మణికంఠ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. హైకోర్టు న్యాయవాదులు మాచర్ల కిషన్ కుమార్ గౌడ్, పద్మలత దంపతుల కుమారుడైన రాజా కార్తికేయన్ గౌడ్ జన్మదిన వేడుకల్లో భాగంగా హనుమకొండలో ప్రజలు, బాటసారులకు పండ్లు, మంచినీటి బాటిళ్లను పంపిణీ చేశారు. జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమంగా నిర్వహించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. రోజువారీ అవసరాల కోసం బయటకు వచ్చే ప్రజలు, ప్రయాణికులకు పండ్లు, మంచినీరు అందించి తమ వంతు సహాయాన్ని అందించారు. కుటుంబ సభ్యుల సంతోషాన్ని ప్రజలతో పంచుకుంటూ నిర్వహించిన ఈ కార్యక్రమం సేవాభావానికి ప్రతీకగా నిలిచింది. మణికంఠ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలను నిర్వహిస్తూ సామాజిక సేవలో భాగస్వామ్యం అవుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జన్మదినం వంటి ప్రత్యేక సందర్భాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా సమాజంలో మానవతా విలువలు, సేవా స్ఫూర్తి మరింత పెంపొందుతాయని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, కుటుంబ సభ్యులు, పలువురు పాల్గొన్నారు.

## ఇల్లంతకుంట రామాలయంలో వైభవంగా

# దసరా వేడుకలు

- స్వామివారి ఊరేగింపుతో భక్తజన పరవశం..
- శమీ పూజతో పులకించిన భక్తులు

**ఇల్లంతకుంట,జోర్దార్ ప్రతినిధి:**దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని ఇల్లంతకుంట రామాలయంలో నిర్వహించిన వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఆలయంలో దసరా సందడి నెలకొనగా, స్వామివారి దర్శనం కోసం గ్రామస్తులు, భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ప్రత్యేక పూజలు, స్వామివారి ఊరేగింపు, శమీ పూజ కార్యక్రమాలతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. భక్తులు భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

**స్వామివారి ఊరేగింపుతో సందడి**

దసరా ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన స్వామివారి ఊరేగింపు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. ఊరేగింపులో పాల్గొన్న భక్తులు స్వామివారికి భక్తిపూర్వకంగా మొక్కులు సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. పండుగ వాతావరణంలో సాగిన ఉత్సవాలు భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని పంచాయి.

**శమీ పూజతో భక్తుల మొక్కులు**

విజయదశమి పర్వదినం సందర్భంగా నిర్వహించే శమీ పూజకు విశేష ప్రాధాన్యం ఉంది. ఈ సందర్భంగా ఇల్లంతకుంట రామాలయంలో భక్తులు శమీ పూజలో పాల్గొని సంప్రదాయ బద్ధంగా పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు. కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని, ప్రజలందరికీ మంచి జరగాలని ఆకాంక్షిస్తూ భక్తులు పూజలు చేశారు. దసరా పండుగను పురస్కరించుకుని ఆలయానికి వచ్చిన భక్తులతో పరిసరాలు కిటకిటలాడాయి.




**అధికారుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు**

దసరా వేడుకలకు భారీ సంఖ్యలో భక్తులు హాజరయ్యే నేపథ్యంలో పోలీసు, దేవాదాయ శాఖ అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు. ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లపై దృష్టి సారించారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొనడంతో ప్రజలు ఉత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

**ఉత్సవాల్లో ప్రజాప్రతినిధులు**

ఇల్లంతకుంట రామాలయంలో నిర్వహించిన దసరా ఉత్సవాల్లో గ్రామ సర్పంచి దారా సురేష్, ఉప సర్పంచి, వార్డు సభ్యులు, దేవాదాయ శాఖ అధికారులు పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకుని పూజా కార్యక్రమాల్లో భాగస్వాములయ్యారు. గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై దసరా వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.

దసరా పర్వదినం సందర్భంగా ఇల్లంతకుంట రామాలయంలో నెలకొన్న ఆధ్యాత్మిక వాతావరణం, స్వామివారి ఊరేగింపు, శమీ పూజ కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. భక్తుల రాకతో ఆలయ పరిసరాలు పండుగ శోభను సంతరించుకున్నాయి.

# పూలే దేవతలు, పాటలే మంత్రాలు

## తెలంగాణ ఆత్మను ఆవిష్కరించే బతుకమ్మ, విజయదశమి

ఆశ్వయుజ మాసం మళ్లీ వచ్చేసింది. తెలంగాణ పల్లెల్లో సాయంత్రం కాగానే గుళ్ల ముందు, చెరువు గట్టున, ఊరి నడిబొడ్డున అద్భుత దృశ్యాలు కనిపిస్తున్నాయి. పల్లెల్లో చూస్తే గ్రామ చావిడిలో, పట్టణాల్లో వాడ వాడలా పండుగ సంరంభం ఆవరిస్తోంది. తంగేడు పూల పసుపు, గునుగు పూల తెలుపు, బంతి చామంతులు, తీరొక్క పూల రంగులు మిరుమిట్లు గొలుపుతున్నాయి. తెలంగాణలోని దాదాపు ప్రతీ ఇంట్లో పెద్దవాళ్లయిన అవ్వలో, మహిళలో, యువతులో క్రమ పద్ధతిలో వృత్తం మీద వృత్తం, పొర మీద పొర పేరుస్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. అలా పేరుస్తూ పేరుస్తూ పూల గోపురాలు రూపొందిస్తున్నారు. చివరగా ఆ గోపురం శిఖరాన పసుపుతో చేసిన చిన్న గౌరమ్మ కొలువుదీరుతోంది. అదే బతుకమ్మ. ప్రపంచంలోనే పువ్వులను దేవతగా కొలిచే ఏకైక రాష్ట్రం తెలంగాణలో ఈ పూల పండుగ ఘనత గర్వంగా చిందులు వేస్తోంది.

పల్లెలు, పట్టణాలు, నగరాలు, మెట్రో సిటీల్లో కూడా ఆలయాల వద్ద, కూడళ్లలో, మైదానాలలో సాయంత్రం వేళ బతుకమ్మ ఆట పాటల సందడి కనిపిస్తోంది. కొన్ని చోట్ల బతుకమ్మ ఆడుతున్న ప్రదేశాలు కిక్కిరిసిపోతున్నాయి. చీకట్లు ముసురుకునే సరికి రంగురంగుల పూలతో ఎత్తుగా పేర్చిన గోపురాలు వరసగా వెలుస్తున్నాయి. వాటి చుట్టూ పట్టుచీరలు కట్టిన ఆడపడుచులు వలయాకారంగా నిలబడి చుట్టూ తిరుగుతూ.. చప్పట్ల లయలతో బాణీలు కదుతున్నారు. పట్టు చీరల రెపరెపలు, గాజుల గలగలలు, పిల్లల కేరింతలు అందులో కలిసిపోతున్నాయి.

ఇక్కడ మైకులు అక్కర్లేదు, మంత్రాలు అక్కర్లేదు, పురోహితుడూ అక్కర్లేదు. ఇక్కడ దేవత పూలలో ఉంది, ఆరాధన పాటలో ఉంది. ఎవరో ఒక గొంతు రాగం అందుకుంటుంది. చప్పట్లు లయ అవుతాయి.

వందల కాళ్లు ఒకే వలయంలో కదులుతాయి."ఒక్కేసి పువ్వేసి చందమామా" అని ఒకరు పాట అందుకుంటే, వందలమంది కంఠాలు కలుస్తాయి. అది కేవలం ఒక వేడుక కాదు. తెలంగాణ నేల తన ఉనికిని తానే పాడుకునే ఉత్సవం. ప్రపంచంలో పూలను పూజించే పండుగలు ఉన్నాయి. కానీ పూలనే దేవతగా పేర్చి, ఆమె చుట్టూ ఆడుతూ పాడుతూ ఊరంతా ఒక్కటయ్యే పండుగ మరొకటి లేదు. అదే బతుకమ్మ.

**పేరులోనే పరమార్థం :**
పేరులోనే పండుగ తత్వం ఉంది. బతుకమ్మ అంటే బతుకునిచ్చే అమ్మ అని పెద్దల భాష్యం. ఇది బతుకును కాపాడే తల్లి, జీవనాధారమైన ప్రకృతి మాత, అందుకే ఇక్కడ పూజకు విగ్రహం ఉండదు, పురోహితుడు ఉండడు, మంత్రాల పఠనమూ ఉండదు.
ఖరీదైన పనూలకూ బతుకమ్మలో స్థానం లేదు. కంచెల వెంట, చేలగట్ల మీద, చెరువు ఒడ్డున ఎవరూ పట్టించుకోకుండా పూసే సామాన్య పూలే ఇక్కడ దేవతా రూపాలు. తంగేడు, గునుగు, బంతి, చామంతి, గుమ్మడి, కట్లపూలు, రుద్రాక్ష పూలు వంటివే దేవత రూపం. పొలం గట్లమీద, చెరువు ఒడ్డున, కంచెల వెంట పెరిగే సామాన్యమైన పూలకు గౌరవం కల్పించిన పండుగ ఇది.
అంటే.. పేదవాడి చేనుకూ, ధనికుడి తోటకూ సమాన గౌరవం ఇచ్చే పండుగ ఇది. పూలను పేర్చే తీరులోనూ ఒక కళ ఉంది. తామర ఆకారంలో వృత్తాలు వృత్తాలుగా, పైకి వెళ్లేకొద్దీ చిన్నవి అవుతూ శిఖరానికి చేరుతాయి. పైన గౌరమ్మ శక్తి స్వరూపిణిగా నిలుస్తుంది. పూలు మాత్రమే కాదు, తరాలుగా ఆడవాళ్ల చేతుల్లో నిలిచిన నైపుణ్యం కూడా ఆ గోపురంలో పేర్చి ఉంటుంది.

**తొమ్మిది రోజులు, తొమ్మిది రూపాలు :**
మహాలయ అమావాస్య నాడు "ఎంగిలిపూల బతుకమ్మ"తో సంబరాలు ప్రారంభమవుతాయి. దుర్గాష్టమి నాడు "సద్దుల బతుకమ్మ"తో ముగుస్తాయి. మధ్యలో ప్రతి రోజుకూ బతుకమ్మకు ఒక పేరు, ఒక నైవేద్యం ఉంటాయి.

**తొలిరోజు - ఎంగిలిపూల బతుకమ్మ:** పూలను ముందే సేకరించి ఉంచడం వల్ల ఈ పేరుతో పిలుస్తారంటారు. మొదటిరోజు బతుకమ్మ ఆడటం పూర్తయిన తర్వాత నువ్వులు, బియ్యప్పిండితో చేసిన సత్తుపిండి ప్రసాదంగా పెడతారు.

**రెండో రోజు - అటుకుల బతుకమ్మ:** పప్పు, బెల్లం, అటుకులు నైవేద్యంగా పెడతారు.
**మూడో రోజు - ముద్దపప్పు బతుకమ్మ:**
**నాలుగో రోజు - నానబియ్యం బతుకమ్మ:**
**ఐదో రోజు - అట్ల బతుకమ్మ:** అట్లు (దోసెలు) నైవేద్యంగా సమర్పిస్తారు.
**ఆరో రోజు - అలిగిన బతుకమ్మ:**. అమ్మ అలిగిందనే నమ్మకంతో ఆ రోజు బతుకమ్మ ఆడరు.. అలాగే, నైవేద్యం ఉండదు.
**ఏడో రోజు - వేపకాయల బతుకమ్మ:** బియ్యప్పిండితో వేపకాయల ఆకారాలు చేసి వేయిస్తారు.
**ఎనిమిదో రోజు - వెన్నముద్దల బతుకమ్మ:** వెన్న, నువ్వులు, బెల్లంతో చేసిన ముద్దలను ప్రసాదంగా పెడతారు.
**తొమ్మిదో రోజు - సద్దుల బతుకమ్మ:** ఇది బతుకమ్మ పండుగలో చివరి రోజు మహోత్సవం.



పెరుగన్నం, పులిహోర, చింతపండు పులిహోర, నిమ్మకాయ పులిహోర, కొబ్బరన్నం, నువ్వుల అన్నం వంటి సద్ది (సద్దులు) తయారుచేసి, పెద్ద బతుకమ్మను పేర్చి నిమజ్జనం చేస్తారు.

ఈ పేర్లు, ఈ నైవేద్యాలు తెలంగాణ వ్యవసాయ జీవనంతో ముడిపడి ఉన్నాయి. కొత్తగా పండిన నువ్వులు, పప్పులు, బియ్యం, బెల్లం వంటివి ఇంట్లోకి వచ్చే కాలమిది. ఆ పంటలో మొదటి వాటాను అమ్మకు సమర్పించే కృతజ్ఞతా సంప్రదాయమే బతుకమ్మలో కనిపిస్తుంది.

**చరిత్ర ఏం చెబుతోంది? :**
బతుకమ్మ ఎప్పుడు, ఎలా మొదలైందో ఏ శాసనంలోనూ లేదు. దీంతో, బతుకమ్మ పుట్టుకకు సంబంధించి అనేక కథనాలు ప్రచారంలో ఉన్నాయి. జానపద సంప్రదాయంలో ఇలా ఉండటం సహజమే అంటారు చరిత్రకారులు.

**లక్ష్మీదేవి కథ :**
చోళ రాజు ధర్మాంగదుడు యుద్ధంలో తమ వంద మంది కుమారులను కోల్పోయాడు. సంతానం కోసం ఆయన భార్య సత్యవతి లక్ష్మీదేవిని ఆరాధించింది. ఆ తల్లి వారి కడుపున కుమార్తెగా జన్మించింది. "చిరకాలం బతుకు" అని ఋషులు దీవించడంతో ఆమెకు బతుకమ్మ అని పేరు పెట్టారని ప్రతీతి. ఆ దంపతులు కుమార్తెను పూలతో అలంకరించి ఆరాధించిన సంప్రదాయమే ఈ పండుగ అని చెబుతారు.

**దుర్గాదేవి కథ :**
మహిషాసురుని సంహరించిన తర్వాత అలసిపోయిన దుర్గమ్మ నిద్రపోయిందని, ఆమె మేల్కొన్న దశమి రోజున ప్రజలు పూలతో స్వాగతం పలికారని మరో కథ నానుడిలో ఉంది. దసరా ఉత్సవాలతో బతుకమ్మను కలిపే సూత్రం ఇదే.

**సామాజిక కథనం :**
భూస్వాముల అణచివేతకు గురై ప్రాణాలు కోల్పోయిన ఒక ఆడపడుచును ఊరి ఆడవాళ్లు గుర్తు చేసుకుని పాడిన పాటల నుంచి ఈ పండుగ పుట్టిందని కొందరి నమ్మకం. బతుకమ్మ పాటల్లో కష్టాలు, అత్తింటి వేధింపులు, పుట్టింటి మమకారం, అన్నదమ్ముల ప్రేమ ఎక్కువగా వినిపించడం ఈ వాదనకు బలం ఇస్తుంది.

చారిత్రక పరిశోధకులు కాకతీయుల కాలం నాటి సంప్రదాయ ప్రస్తావనలను కూడా గుర్తు చేస్తారు. కాబట్టి ఈ పండుగ దేవాలయ సంస్కృతి నుంచి కాక, స్త్రీల సామూహిక జానపద సంప్రదాయం నుంచే ఎదిగిందన్నది నిపుణుల సాధారణ అభిప్రాయం. బతుకమ్మ పాటలకు రాత ప్రతులు లేవు. ఎందుకంటే ఈ చరిత్రను రాసింది గ్రంథాలు కాదు, గొంతులు. అవి నోటి నుంచి నోటికి, తరం నుంచి తరానికి, అమ్మ నుంచి కూతురికి ప్రవహిస్తూ వస్తున్నాయి.

**పాటలే బతుకమ్మ పండుగ ఆత్మ :**
బతుకమ్మ పాటలు తెలంగాణ ఆడబిడ్డల స్వరంలో నిక్షిప్తమైన సామాజిక చరిత్ర. పాటల్లో రామాయణ, భారత కథలు వినిపిస్తాయి. శివపార్వతుల కల్యాణం, గౌరమ్మ ముచ్చట్లు వస్తాయి. అదే సమయంలో ఇంటి పనుల్లో అలసిన ఆడవాళ్ల బాధ, పుట్టింటికి వెళ్లాలనే ఆరాటం, సవతి పోరు, కట్నం కష్టాలు, కరువు కాటకాలు కూడా పాటల్లో తొంగి చూస్తాయి. ఒక పాట మొదలైతే ఒకరు పాడతారు, మిగతావారు ఏకకంఠంతో కోరస్ అందుకుంటారు. "ఒక్కేసి పువ్వేసి చందమామా" అని ఒక గొంతు పాడితే, "ఒక్క జాము అయ్యే చందమామా" అని వందల గొంతులు తిరిగి పలుకుతాయి.
"ఉయ్యాలో", "చందమామా", "గౌరమ్మా" వంటి పల్లవులు సామూహిక లయను నిలబెడతాయి. ఇది ఒక వినోదం మాత్రమే కాదు, మగవారి ముందు చెప్పలేని మాటను పాటలో, అందరితో కలిసి, ధైర్యంగా చెప్పే వేదిక ఇది. స్త్రీలు తమ మనసులోని మాటను సమాజం ముందుకు తెచ్చే సురక్షిత వేదిక కూడా. అందుకే బతుకమ్మ స్త్రీల సామూహిక స్వరం అంటారు.

**స్త్రీల పండుగ, సామాజిక వేడుక :**
బతుకమ్మ కులాలు, వర్గాల అడ్డుగోడలను చెరిపే పండుగ అని సామాజిక శాస్త్రవేత్తలు అంటారు. ఊరిలో అందరూ ఒకే వేదికపైకి వస్తారు. పెళ్లై అత్తింటికి వెళ్లిన ఆడపడుచులు ఈ తొమ్మిది రోజులూ పుట్టింటికి వస్తారు. ఏడాది పొడవునా కలవలేని అక్కచెల్లెళ్లు, చిన్ననాటి స్నేహితులు కలుసుకునే అవకాశం ఇదే.
పర్యావరణ కోణంలో కూడా ఈ పండుగకు ప్రత్యేకత ఉంది. బతుకమ్మలో వాడే తంగేడు, గునుగు వంటి పూలకు ఔషధ గుణాలు ఉన్నాయని ఆయుర్వేద నిపుణులు చెబుతారు. నిమజ్జనం సమయంలో ఈ పూలు నీటిలో కలిసి, చెరువుల్లోని నీటిని శుద్ధి చేస్తాయని పెద్దలు చెబుతారు. వర్షాకాలం ముగిసి చెరువులు నిండే సమయంలో జలవనరులను పూజించే సంప్రదాయం ఇందులో ఇమిడి ఉంది.

**ఉద్యమం నుంచి రాష్ట్ర పండుగ వరకు :**
తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ కాలంలో బతుకమ్మ ఒక సాంస్కృతిక ప్రతీకగా మారింది. తెలంగాణ ఆత్మగౌరవాన్ని చాటే చిహ్నంగా, ఆడబిడ్డల గొంతుకగా ఉద్యమ వేదికలపై బతుకమ్మలు నిలిచాయి. 2014లో రాష్ట్రం ఏర్పడిన తర్వాత బతుకమ్మను రాష్ట్ర పండుగగా అధికారికంగా ప్రకటించారు.
అప్పటి నుంచి ప్రభుత్వ ఆధ్వర్యంలో వేడుకలు జరుగుతున్నాయి. హైదరాబాద్ ట్యాంక్‌బండ్, హుస్సేన్ సాగర్ తీరం, వరంగల్ వేయి స్తంభాల గుడి ప్రాంగణం వంటివి ప్రధాన వేడుక కేంద్రాలయ్యాయి. విదేశాల్లోని తెలుగు సంఘాలు కూడా అమెరికా, యూరప్, గల్ఫ్ దేశాల్లో బతుకమ్మ ఆడుతూ సంప్రదాయాన్ని ఖండాంతరాలకు తీసుకెళ్లాయి.

అయితే, ఈ ప్రచార వైభవం కమ్ముకున్న నేపథ్యంలో బతుకమ్మ పండుగ సహజత్వంపై కొన్ని ప్రశ్నలు పుడుతున్నాయి. పెద్ద వేదికలు, ప్రదర్శనలు, పోటీలు పెరిగే కొద్దీ పల్లెల్లోని అసలైన సామూహిక సహజత్వం మసకబారుతోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పాటల్లో పాత నుడికారం స్థానంలో సినిమా బాణీలు వస్తున్నాయన్న ఆందోళన జానపద పరిశోధకుల్లో నెలకొంది. ప్లాస్టిక్ పూలు, రసాయన రంగుల వాడకం పెరగడంపైనా పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు. సంప్రదాయ పూలను కాపాడుకోవడమే బతుకమ్మ నిజమైన స్ఫూర్తిని నిలబెడుతుందన్న చర్చ సర్వత్రా సాగుతోంది.

**దసరా - విజయానికి ప్రతీక :**
బతుకమ్మ ముగిసిన రెండు రోజులకు విజయదశమి (దసరా) పండుగ జరుపుకుంటారు. నవరాత్రుల్లో దుర్గాదేవి మహిషాసురుని సంహరించిన విజయానికి ప్రతీకగా ఈ పండుగను జరుపుకుంటారు. ఉత్తరాదిలో రావణ దహనంతో రాముని విజయ సూచకంగా ఈ పండుగ జరుగుతుంది.
తెలంగాణలో కూడా దసరాకు తనదైన ప్రత్యేక ముద్ర ఉంది.

**జమ్మి పూజ :**
దసరా పండుగ రోజు సాయంత్రం ఊరి చివర జమ్మి (శమీ) చెట్టు వద్దకు వెళ్లి పూజ చేయడం ఈ పండుగ ప్రధాన ఘట్టం. మహా భారత కథనం ప్రకారం, పాండవులు అజ్ఞాతవాసంలో తమ ఆయుధాలను జమ్మి చెట్టుపై దాచారు. తిరిగి తీసుకొని విజయం సాధించారు. అందుకే జమ్మి విజయానికి, ధర్మానికి చిహ్నంగా విశ్వసిస్తారు. దసరానాడు పూజ తర్వాత జమ్మి ఆకులను "బంగారం"గా పంచుకుంటారు.
జమ్మి ఆకులను పెద్దలకు ఇచ్చి, వారి పాదాలకు నమస్కరించి ఆశీర్వాదం తీసుకునే ఆచారం ఉంది. పెద్దలు చిన్నవారిని ఆశీర్వదించి కౌగిలించుకుంటారు.
పాత విభేదాలు మరచి మనసులు కలిసే సందర్భమిది.

**పాలపిట్ట దర్శనం :**
దసరా రోజు పాలపిట్టను చూడటం శుభసూచకంగా భావిస్తారు. తెలంగాణ రాష్ట్ర పక్షి కూడా పాలపిట్టే. ఈ పక్షి కోసం పొలాల వెంట వెతికే సంప్రదాయం పల్లెల్లో నేటికీ కనిపిస్తుంది.

**ఆయుధ పూజ, వాహన పూజ :**
విజయదశమి నాడు రైతులు నాగలి, పనిముట్లను, వృత్తిదారులు తమ సాధనాలను పూజిస్తారు. శ్రమకు, వృత్తికి గౌరవమిచ్చే సంస్కృతి ఇక్కడ కనిపిస్తుంది.

**అలయ్ బలయ్ :**
దసరా మరుసటి రోజు హైదరాబాద్‌లో జరిగే "అలయ్ బలయ్" కార్యక్రమం రాజకీయ, సామాజిక వర్గాలు కలుసుకునే వేదికగా పేరొందింది. కౌగిలింతలతో శుభాకాంక్షలు చెప్పుకునే ఈ సంప్రదాయం తెలంగాణ సంస్కృతిలో భాగమైంది. బీజేపీ సీనియర్ నాయకులు, హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అలయ్ బలయ్ ఫౌండేషన్ ను స్థాపించి దాదాపు రెండు దశాబ్దాలుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు.
తెలంగాణ సంస్కృతిలో భాగంగా భావించే అలయ్ బలయ్ కార్యక్రమానికి పార్టీల కతీతంగా ప్రజా ప్రతినిధులు, నాయకులే కాకుండా.. వివిధ రంగాల ప్రముఖులు కూడా అలయ్ బలయ్ కార్యక్రమానికి హాజరవుతారు.

**బతుకమ్మ, దసరా - ఒక దారానికి రెండు పూసలు :**
బతుకమ్మ ప్రకృతిని, స్త్రీ శక్తిని కొలిచే పండుగ. దసరా ధర్మ విజయాన్ని, శక్తిని కొలిచే పండుగ. ఈ రెండూ కలిసే చోట తెలంగాణ ప్రత్యేకత కనిపిస్తుంది. దేవతను పూలతో, పాటతో, సామూహిక ఆనందంతో పూజించడం ఇక్కడి ఆచారం.
గౌరమ్మను పూజించిన చేతులతోనే జమ్మిని పూజిస్తారు. పూలలో అమ్మను చూసినవారికి విజయం అంటే కేవలం యుద్ధంలో గెలుపు కాదు.
అది సామూహిక జీవన విజయం, ఒకరికొకరు తోడుగా అందరూ కలిసి నిలబడటం.

**వాడిపోని వారసత్వం :**
ఒక పండుగ నిలబడేది ఆడంబరాల వల్ల కాదు, తరాల అనుసంధానం వల్ల. బతుకమ్మ పాటలను ఈ తరం పిల్లలకు నేర్పడం, పల్లె పూలను సేకరించే అలవాటును కొనసాగించడం, ప్లాస్టిక్‌ను దూరం పెట్టడం ఇప్పుడు అత్యవసరం. అమ్మమ్మల పాటల రికార్డింగ్‌లు, గ్రామాల వారీ పాఠాంతరాల సేకరణ వంటి డాక్యుమెంటేషన్ పనులు జరగాలని సంస్కృతి పరిశోధకులు కోరుతున్నారు.

సద్దుల బతుకమ్మ నాటి సాయంత్రం చెరువు నీటిపై బతుకమ్మలు నెమ్మదిగా తేలిపోతుంటాయి. చెరువు గట్టున పూలగోపురాలైన బతుకమ్మలను నీటిలో వదులుతూ ఆడబిడ్డలు పాడే వీడ్కోలు పాట ఇలా సాగుతుంది:
"పోయిరా బతుకమ్మా, మళ్లీ రావమ్మా".
ఆ మాటల్లో విషాదం, ఆశ రెండూ ఉన్నాయి. అమ్మ మళ్లీ వస్తుంది, వచ్చే ఏడాది పూలు మళ్లీ పూస్తాయి, ఆడబిడ్డలు మళ్లీ కలుస్తారు. ఈ నమ్మకమే తెలంగాణ సంస్కృతికి ప్రాణం.
పూలు వాడిపోతాయి, కానీ బతుకమ్మ బతుకుతూనే ఉంటుంది.

- సుజాత గోపగోని
63021 64068

---

### దుర్గామాత నామస్మరణతో మార్మోగిన ఎంపెడ్

# ఘనంగా శోభాయాత్ర





**టేకుమట్ల జోర్దార్ ప్రతినిధి:** టేకుమట్ల మండలంలోని ఎంపెడ్ గ్రామంలో కోటగిరి సతీష్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా ముగిశాయి. ఉత్సవాల చివరి రోజున దుర్గామాత విగ్రహంతో నిర్వహించిన శోభాయాత్ర అంగరంగ వైభవంగా సాగింది. దుర్గామాత నామస్మరణలు, భక్తిగీతాలతో గ్రామం మార్మోగింది. ఉత్సవ కమిటీ సభ్యులు, భవానీ మాలధారణ స్వాములు, మహిళలు, యువత, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని శోభాయాత్రను విజయవంతం చేశారు. ఈ సందర్భంగా కోటగిరి సతీష్ గౌడ్ మాట్లాడుతూ నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేసేందుకు సహకరించిన కమిటీ సభ్యులకు, భవానీ మాలధారణ స్వాములకు, మహిళా సోదరీమణులకు, గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.
దుర్గామాత చల్లని ఆశీస్సులతో ఎంపెడ్ గ్రామంతో పాటు టేకుమట్ల మండలం, భూపాలపల్లి నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ప్రజల ఐక్యతతో గ్రామం అభివృద్ధి పథంలో మరింత ముందుకు సాగాలని కోరుకున్నారు.

# విద్యుత్ షాక్‌తో పంచాయతీ కార్మికుడి మృతి

**టేకుమట్ల జోర్దార్ ప్రతినిధి:** విద్యుత్ స్తంభంపై పనిచేయని బల్బును సరిచేసే ప్రయత్నంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై గ్రామ పంచాయతీ బహుళ ప్రయోజన కార్మికుడు మృతి చెందిన ఘటన టేకుమట్ల మండలం ఆకులపల్లిలో విషాదం నింపింది. గ్రామానికి అనుబంధంగా ఉన్న వెంకట్రావుపల్లి పరిధిలోని ఆకులపల్లికి చెందిన కాసవేణి కుమార్ (42) గ్రామ పంచాయతీలో బహుళ ప్రయోజన కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఆకులపల్లిలో రవుల పెద్ద రవి ఇంటి సమీపంలోని విద్యుత్ స్తంభానికి ఉన్న బల్బు పనిచేయకపోవడంతో దాన్ని సరిచేసేందుకు కుమార్ ఇంటి మిద్దెపైకి ఎక్కాడు. కర్రతో బల్బును సరిచేసే ప్రయత్నం చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. దీంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతుడి భార్య కాసవేణి కవిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనకు సంబంధించిన వివరాలను నమోదు చేసుకున్నారు. అయితే మృతుడి కుమార్తె



హైదరాబాద్‌లో ఉండటంతో ఫిర్యాదు ఇవ్వడంలో ఆలస్యం జరిగినట్లు తెలిపారు. ఈ ఘటనతో మృతుడి కుటుంబంలో విషాదం నెలకొనగా, గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# ఫైమా జాతీయ కార్యవర్గ సభ్యుడిగా

## డా. చాలుక్య రాజ్ ఏకగ్రీవ ఎన్నిక

- **కాకతీయ వైద్య కళాశాల అనస్థీషియా పీజీ వైద్యుడికి కీలక బాధ్యతలు**

**హైదరాబాద్:** అఖిల భారత వైద్య సంఘాల సమాఖ్య (ఫైమా) నూతన జాతీయ కార్యవర్గంలో కాకతీయ వైద్య కళాశాల (కేఎంసీ), వరంగల్‌లో మత్తుమందుల వైద్యంలో పీజీ చేస్తున్న డా. చాలుక్య రాజ్ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు సమాఖ్య జాతీయ నాయకత్వం ఆయనకు అధికారిక నియామక పత్రాన్ని అందజేసింది.

**యువ వైద్యుల సమస్యల పరిష్కారానికి కృషి**
డా. చాలుక్య రాజ్ నియామకం పట్ల పలువురు వైద్య విద్యార్థి సంఘాల ప్రతినిధులు, వైద్య సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆయనకు అభినందనలు తెలియజేశారు.

జాతీయ స్థాయిలో వైద్య విద్యార్థులు, జూనియర్ వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.
ఈ సందర్భంగా డా. చాలుక్య రాజ్ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో జాతీయ కార్యవర్గ సభ్యుడిగా అవకాశం కల్పించిన ఫైమా జాతీయ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.
తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని పేర్కొన్నారు.
వైద్య విద్యార్థులు, జూనియర్ వైద్యుల సమస్యల పరిష్కారంతోపాటు వారి సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



**డా. శ్రీనాథ్ సేవలకు అభినందనలు**
మరోవైపు, ఫైమా జాతీయ అధ్యక్షుడిగా కొనసాగిన డా. శ్రీనాథ్ తన పదవీకాలాన్ని విజయవంతంగా పూర్తి చేశారు.
ఆయన నాయకత్వంలో సమాఖ్య చేపట్టిన కార్యక్రమాలు, వైద్య విద్యార్థులు, జూనియర్ వైద్యుల సమస్యల పరిష్కారం కోసం చేసిన కృషిని పలువురు అభినందించారు.

డా. చాలుక్య రాజ్ నూతన బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో వైద్య విద్యార్థులు, యువ వైద్యుల సమస్యలకు జాతీయ స్థాయిలో మరింత ప్రాధాన్యం లభిస్తుందని పలువురు ఆకాంక్షించారు.

# వ్యాపార సందడి.. రోగులకు ప్రాణసంకటం!

- **బట్టల దుకాణం ప్రారంభోత్సవంలో డీజే హోరు..**
- **ఆసుపత్రుల్లో రోగుల అవస్థలు**
- **కొండూరి స్ట్రీట్‌లో 24 గంటల శబ్ద కాలుష్యంపై ఆందోళన.. పోలీసులు, మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ ఏదీ?**
- **అనుమతులు లేకుండా డీజేలు నడిపితే కేసులంటారు.. మరి ఇప్పుడు ఎక్కడున్నారు?**




**జమ్మికుంట జోర్దార్ ప్రత్యేక ప్రతినిధి:**వ్యాపారం చేసుకోవడం తప్పు కాదు.. ప్రారంభోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకోవడమూ తప్పు కాదు. కానీ తమ వ్యాపార వేడుకల కోసం ఇతరుల ప్రశాంతతను హరించే హక్కు ఎవరికి ఇచ్చారు? ఒకవైపు కొత్త వస్త్ర దుకాణం ప్రారంభోత్సవ సందడి.. మరోవైపు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న రోగుల అవస్థలు! కొండూరి స్ట్రీట్ పరిసరాల్లో డీజే శబ్దాల హోరుపై స్థానికులు వ్యక్తం చేస్తున్న ఆందోళనలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి.

ప్రైవేట్ వస్త్ర దుకాణం ప్రారంభోత్సవం సందర్భంగా పెద్దఎత్తున డీజే శబ్దాలు వినిపించాయని, దాదాపు 24 గంటల పాటు సాగిన శబ్ద హోరుతో ఆసుపత్రుల్లోని రోగులు, పరిసర ప్రాంతాల ప్రజలు, దుకాణదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. వ్యాపార వేడుకల పేరుతో ప్రజల ప్రశాంతతకు భంగం కలిగితే బాధ్యత ఎవరిది? నిబంధనలు అమలు చేయాల్సిన అధికారులు ఏం చేస్తున్నారు? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**రోగుల బాధ కంటే వేడుకల సందడే ముఖ్యమా?**

ఆసుపత్రికి వెళ్లేది ఆరోగ్యం బాగుపడాలని.. వైద్యం పొందుతూ ప్రశాంతంగా కోలుకోవాలని! అలాంటి ఆసుపత్రుల పరిసరాల్లోనే భారీ శబ్దాలు వినిపిస్తే రోగుల పరిస్థితి ఏమిటి? ఇప్పటికే అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్నవారికి శబ్దాల వల్ల మరింత అసౌకర్యం కలగవచ్చన్న విషయాన్ని నిర్వాహకులు గుర్తించాల్సిన అవసరం లేదా? వైద్యులు రోగులకు చికిత్స అందించే సమయంలోనూ, రోగులు విశ్రాంతి తీసుకునే వేళల్లోనూ శబ్దాల తీవ్రత ఇబ్బందికరంగా ఉంటే దానిని నియంత్రించాల్సిన బాధ్యత ఎవరిది?

రోగికి కావాల్సింది వైద్యం.. పరిసరాలకు కావాల్సింది ప్రశాంతత. కానీ వేడుకల హోరు ఆ ప్రశాంతతనే మింగేస్తే సామాన్యులు ఎవరికి మొరపెట్టుకోవాలి? ఇదే ఇప్పుడు కొండూరి స్ట్రీట్ పరిసరాల్లో వినిపిస్తున్న ప్రశ్న.

**24 గంటల హోరు.. ప్రజలకు నరకయాతన!**

వస్త్ర దుకాణం ప్రారంభోత్సవం సందర్భంగా డీజే శబ్దాలు సుదీర్ఘ సమయం పాటు కొనసాగినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. కొండూరి స్ట్రీట్ పరిసరాల్లోని ఆసుపత్రులు, ఇతర దుకాణాలు, నివాస ప్రాంతాలపై ఈ శబ్దాల ప్రభావం పడిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యాపార సముదాయాల మధ్య ఇప్పటికే వాహనాల రద్దీ సమస్యగా మారుతున్న తరుణంలో, భారీ శబ్దాలు తోడైతే పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారుతుందని చెబుతున్నారు.

'ఇంట్లో పెళ్లి చేస్తే వీధంతా పందిరి వేయాలా?' అన్న చందంగా.. ఒకరి వేడుక మరొకరికి ఇబ్బందిగా మారకూడదన్న కనీస బాధ్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలి. వ్యక్తిగత లేదా వ్యాపార వేడుకలు ప్రజల ఆరోగ్యం, ప్రశాంతత, రాకపోకలకు విఘాతం కలిగించకూడదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

**పార్కింగ్ సమస్యకు తోడు శబ్ద కాలుష్యం!**

ఇప్పటికే కొండూరి కాంప్లెక్స్ పరిసరాల్లో షాపింగ్‌కు వచ్చే వినియోగదారుల వాహనాల పార్కింగ్‌పై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కొత్త వాణిజ్య సముదాయాల రాకతో రద్దీ పెరిగే అవకాశముండగా, పార్కింగ్ ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణపై ముందస్తు చర్యలు అవసరమని స్థానికులు కోరుతున్నారు. దీనికి తోడు ప్రారంభోత్సవాల సందర్భంగా భారీ శబ్దాలు వినిపిస్తే ఆ ప్రాంతంలో నివసించే ప్రజలు, ఆసుపత్రులకు వచ్చే రోగులు, ఇతర వ్యాపార సంస్థల యజమానులు మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఒకవైపు వాహనాలు ఎక్కడ నిలపాలో తెలియని పరిస్థితి.. మరోవైపు శబ్దాల హోరు.. వెరసి సామాన్యులకు ఇబ్బందులు తప్పడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వాణిజ్య అభివృద్ధి పేరుతో ప్రజా సౌకర్యాలను విస్మరిస్తే ఎలా? అన్న ప్రశ్నకు సంబంధిత అధికారులు సమాధానం చెప్పాల్సి ఉంది.

**పోలీసులు,మున్సిపల్ అధికారులు ఏం చేస్తున్నట్లు?**

శబ్ద కాలుష్యాన్ని నియంత్రించడం, ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించడం, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడటంలో సంబంధిత శాఖల పాత్ర కీలకం. డీజే వినియోగానికి వర్తించే నిబంధనలు, అనుమతుల పరిస్థితి, శబ్ద పరిమితుల అమలుపై అధికారులు పరిశీలన జరపాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా ఆసుపత్రుల పరిసరాల్లో శబ్దాల వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయన్న ఫిర్యాదులు వస్తే వాటిని నిర్లక్ష్యం చేయకుండా క్షేత్రస్థాయిలో స్పందించాలి.

అనుమతులు లేకుండా డీజేలు నడిపితే కేసులు నమోదు చేస్తామని అధికారులు హెచ్చరిస్తున్న సందర్భాలు ఉన్నప్పటికీ, నిబంధనలు ఉల్లంఘించినట్లు ఫిర్యాదులు వచ్చినప్పుడు చర్యలు ఎంతవరకు తీసుకుంటున్నారన్న ప్రశ్నలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. అయితే ఈ ఘటనలో అనుమతులు తీసుకున్నారా? శబ్ద పరిమితులు ఉల్లంఘించారా? అధికారులకు ముందస్తు సమాచారం ఉందా? అనే అంశాలపై అధికారిక వివరణ రావాల్సి ఉంది.

'కంచే చేను మేస్తే.. కాపలాదారుడెవరు?' అన్న సామెతను గుర్తు చేసుకుంటున్న స్థానికులు.. ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయన్న ఆరోపణలపై అధికారులు స్పందించి వాస్తవాలను పరిశీలించాలని కోరుతున్నారు.

**నిబంధనలు సామాన్యులకేనా?**

సాధారణ ప్రజలు చిన్నపాటి కార్యక్రమాలు నిర్వహించినప్పుడు నిబంధనల గురించి గుర్తుచేసే యంత్రాంగం.. భారీ స్థాయిలో జరిగే వాణిజ్య ప్రారంభోత్సవాల విషయంలోనూ అదే ప్రమాణాలను పాటిస్తోందా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. చట్టం అందరికీ సమానమే అయినప్పుడు, వ్యాపార సంస్థలైనా, వ్యక్తిగత వేడుకలైనా వర్తించే నిబంధనలను ఒకే విధంగా అమలు చేయాలన్న డిమాండ్ వినిపిస్తోంది.

శబ్ద కాలుష్య నియంత్రణ నిబంధనల ప్రకారం అనుమతులు, సమయ పరిమితులు, శబ్ద స్థాయుల విషయంలో ఏమైనా ఉల్లంఘనలు జరిగాయా? అనే అంశాన్ని అధికారులు నిర్ధారించాలి. తప్పిదాలు ఉన్నట్లు తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. ఫిర్యాదులు లేకపోయినా ప్రజలకు ఇబ్బందులు కలిగే అవకాశం ఉన్న ప్రాంతాల్లో ముందస్తు పర్యవేక్షణ చేపట్టడం అవసరమని పట్టణవాసులు అభిప్రాయపడుతున్నారు.

**కమిషనర్ స్పందిస్తారా.. పోలీసు అధికారులు కదులుతారా?**

కొండూరి స్ట్రీట్ పరిసరాల్లో పార్కింగ్ సమస్య, ట్రాఫిక్ రద్దీ, డీజే శబ్దాలపై వ్యక్తమవుతున్న ఆందోళనలకు పరిష్కారం చూపాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంది. వస్త్ర దుకాణానికి సంబంధించిన పార్కింగ్ ఏర్పాట్లు, వర్తించే భవన నిర్మాణ నిబంధనలు, ప్రారంభోత్సవంలో డీజే వినియోగానికి సంబంధించిన అనుమతులు, శబ్ద పరిమితుల పాటింపు వంటి అంశాలను పరిశీలించాల్సిన అవసరం ఉంది.

మున్సిపల్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలిస్తారా? పోలీసు శాఖ శబ్ద కాలుష్యంపై వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి చర్యలు తీసుకుంటుందా? ఆసుపత్రుల పరిసరాల్లో రోగులకు ప్రశాంత వాతావరణం కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపడతారా? అన్నది వేచి చూడాలి.

వ్యాపారానికి స్వాగతం.. కానీ ప్రజలకు ఇబ్బందులు వద్దు! వేడుకలకు అభ్యంతరం లేదు.. కానీ రోగుల బాధలు పట్టించుకోకుండా శబ్దాల హోరు కొనసాగడం సమంజసమా? అభివృద్ధి అంటే భవనాలు, దుకాణాలు పెరగడమే కాదు.. ప్రజలకు సౌకర్యాలు, ప్రశాంతత, భద్రత కల్పించడం కూడా. ఈ విషయాన్ని అధికారులు, నిర్వాహకులు గుర్తించి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్థానికులు కోరుతున్నారు.

# ఇల్లంతకుంట గ్రామ వాసికి డాక్టరేట్

## డా.కందె రమేష్‌కు ఘన సన్మానం



**(ఇల్లంతకుంట జోర్దార్ ప్రతినిధి)**ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి సూక్ష్మజీవ శాస్త్రంలో పీహెచ్‌డీ పట్టా పొందిన ఇల్లంతకుంట కు చెందిన డా. కందె రమేష్‌కు స్వగ్రామంలో ఘనంగా సన్మానం నిర్వహించారు. రైతు కుటుంబంలో జన్మించి ఉన్నత విద్యలో విశేష ప్రతిభ కనబరిచి డాక్టరేట్ సాధించడం గ్రామానికి గర్వకారణంగా నిలిచింది.

ఈ సందర్భంగా గ్రామ సర్పంచి దారా సురేష్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు ఆయనను అభినందించారు.

తన విజయానికి తల్లిదండ్రులు కందె రాజయ్య, కందె రాధ ప్రోత్సాహం, గురువుల మార్గదర్శకత్వం ఎంతో దోహదపడ్డాయని రమేష్ తెలిపారు.

తన పరిశోధనా పర్యవేక్షకురాలు ప్రొఫెసర్ సందీప్త బుర్గుల సహకారానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రస్తుతం మైక్రాన్‌ఎల్ లైఫ్ సైన్సెస్ సంస్థ వ్యవస్థాపకుడు, ముఖ్య కార్యనిర్వహణాధికారిగా కొనసాగుతున్నారు.

# అంగన్‌వాడీ పనుల నిధులపై అధికారుల వివరణ

- **పనులు కార్యనిర్వాహక సంస్థ ఆధ్వర్యంలోనే.. ప్రైవేటు వ్యక్తులకు చెల్లింపులు జరగలేదు**
- **జోర్దార్‌లో వచ్చిన కథనంపై జిల్లా సంక్షేమ అధికారి రిజాయిండర్**

**జోర్దార్ ప్రతినిధి, వరంగల్:**వరంగల్ జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధి పనులకు సంబంధించిన నిధుల వినియోగంపై జోర్దార్ ఆన్‌లైన్ పత్రికలో అక్టోబర్ 18న ప్రచురితమైన కథనంపై జిల్లా సంక్షేమ అధికారి వివరణ ఇచ్చారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో క్షేత్రస్థాయిలో పనులు జరగకుండానే పూర్తయినట్లు చూపించారన్న కథనంలో వాస్తవం లేదని స్పష్టం చేశారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్ల నిర్మాణం, గోడలకు రంగులు వేయడం, నేల అభివృద్ధి వంటి పనులకు టీజీఈడబ్ల్యూఐడీసీ, పంచాయతీరాజ్ శాఖల కార్యనిర్వాహక ఇంజినీర్లను కార్యనిర్వాహక సంస్థలుగా నియమించినట్లు తెలిపారు. ఆయా పనులన్నీ సంబంధిత కార్యనిర్వాహక సంస్థల ఆధ్వర్యంలోనే చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

**ఎంబీ రికార్డుల ఆధారంగా చెల్లింపులు**

పనులు పూర్తయిన అనంతరం కొలతల పుస్తకాల (ఎంబీ రికార్డుల) ప్రకారం చెల్లింపులు చేపడుతున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి వివరించారు. ఈ చెల్లింపులు చెక్కుల ద్వారా సంబంధిత కార్యనిర్వాహక సంస్థల ఖాతాలకే బదిలీ అవుతాయని, ప్రైవేటు వ్యక్తులకు ఎలాంటి చెల్లింపులు జరగలేదని స్పష్టం చేశారు.

జిల్లా సంక్షేమ అధికారి, జిల్లా కలెక్టర్ ఆమోదంతోనే చెల్లింపులు జరుగుతాయని పేర్కొన్నారు.

**క్షేత్రస్థాయి ధ్రువీకరణ తర్వాతే పరిశీలన**

అంగన్‌వాడీ కేంద్రాల్లో చేపట్టిన పనులకు సంబంధించి ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవోలు, సెక్టారు సూపర్‌వైజర్ల ధ్రువీకరణను కూడా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో పనులు జరగలేదంటూ ప్రచురితమైన కథనంలో వాస్తవం లేదని పేర్కొంటూ, సంబంధిత అంశాలపై వివరణతో కూడిన రిజాయిండర్‌ను సమర్పించారు.

# అంగన్‌వాడీ నిధులపై అధికారిక వివరణలో అసలు నిజాలేవి?

- **చెల్లింపులు జరిగితే స్పష్టంగా చెప్పాలి.. వీదీ రికార్డులు, బిల్లులు, బ్యాంకు లావాదేవీలు బహిర్గతం చేయాలి!**
- **వరంగల్ జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ వ్యవహారంపై సమగ్ర విచారణకు డిమాండ్**

**(వరంగల్: జోర్దార్)**జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధి పనుల నిధుల వినియోగంపై వెలువడిన వార్తకు సంబంధించి జిల్లా సంక్షేమ అధికారి ఇచ్చిన వివరణ ఇప్పుడు మరిన్ని ప్రశ్నలకు తావిస్తోంది. అక్టోబర్ 18న ప్రచురితమైన వార్తపై అక్టోబర్ 19న విడుదలైన వివరణలో పనులను సంబంధిత ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ల ఆధ్వర్యంలో చేపడుతున్నామని, మెజర్‌మెంట్ బుక్ (వీదీ) రికార్డుల ఆధారంగా బిల్లుల పరిశీలన జరుగుతోందని పేర్కొన్నారు. అయితే, పనులు చేపట్టిన విధానం గురించి వివరణ ఇవ్వడం ఒకటైతే, వాటికి సంబంధించిన బిల్లులు ఎంతవరకు చెల్లించారు? ఏ పనులకు నిధులు విడుదలయ్యాయి? అనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానం ఇవ్వడం మరో అంశం.

**చెల్లింపులపై స్పష్టత ఏది?**

అంగన్‌వాడీ కేంద్రాల్లో అభివృద్ధి పనులకు సంబంధించి చెల్లింపులు జరిగినట్లు సమాచారం ఉన్న నేపథ్యంలో, చెల్లింపుల స్థితిపై అధికారులు పూర్తి వివరాలు వెల్లడించాల్సిన అవసరం ఉంది. చెల్లింపులు జరగలేదని పేర్కొన్నట్లయితే, ఏ పనులకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి? ఇప్పటికే చెల్లింపులు జరిగి ఉంటే, వాటి వివరాలను ఎందుకు స్పష్టంగా వెల్లడించడం లేదు? చెల్లింపులపై భిన్నమైన సమాచారం ఎందుకు వెలువడుతోంది? అన్న ప్రశ్నలకు రికార్డుల ఆధారంగా సమాధానం చెప్పాలి.

**వీదీ రికార్డులు ఉన్నాయంటే పనులు పూర్తయినట్లేనా?**

పనులు చేపట్టినట్లు కొలతల పుస్తకాల్లో నమోదు చేయడం, వాటికి సంబంధించిన బిల్లులను పరిశీలించడం, నిధులను విడుదల చేయడం వేర్వేరు దశలు. అందువల్ల వీదీ రికార్డులు ఉన్నాయనే కారణంతోనే ప్రతి పని నాణ్యతతో పూర్తయిందని లేదా ప్రతి బిల్లు సక్రమంగా చెల్లించబడిందని నిర్ధారించలేం. క్షేత్రస్థాయిలో పనుల వాస్తవ పరిస్థితిని పరిశీలించి, రికార్డుల్లోని కొలతలు, బిల్లుల్లోని మొత్తాలు, చెల్లింపు వివరాలను సరిపోల్చాలి.

**అధికారిక వివరణకు రికార్డులే ప్రామాణికం!**

జిల్లా సంక్షేమ అధికారి తన వివరణలో పేర్కొన్న TGEWIDC, పంచాయతీరాజ్ శాఖల ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ల ఆధ్వర్యంలో జరిగిన పనులకు సంబంధించిన వివరాలను సంబంధిత అధికారులు బహిర్గతం చేయాలి. పనుల అంచనా వ్యయం, మంజూరైన నిధులు, పూర్తయిన పనులు, సమర్పించిన బిల్లులు, ఆమోదించిన బిల్లులు, వాస్తవంగా చెల్లించిన మొత్తాలు, పెండింగ్ చెల్లింపుల వివరాలను వెల్లడించాలి. పనులు పూర్తికాకుండానే బిల్లులు చెల్లించినట్లు తేలితే లేదా రికార్డుల్లో వ్యత్యాసాలు బయటపడితే, బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి.

**క్షేత్రస్థాయి తనిఖీతోనే అసలు విషయం బయటపడాలి!**

అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధి పనులపై సంబంధిత శాఖలకు సంబంధం లేని స్వతంత్ర అధికారులతో విచారణ జరిపించాలి. ప్రతి కేంద్రంలో జరిగిన పనులను ప్రత్యక్షంగా పరిశీలించి, వీదీ రికార్డులు, బిల్లులు, చెల్లింపు ఉత్తర్వులు, బ్యాంకు లావాదేవీలను పరస్పరం సరిపోల్చాలి. పనులు చేయకుండానే బిల్లులు సమర్పించారా? చేసిన పనుల విలువకు మించి చెల్లింపులు జరిగాయా? చెల్లింపులు జరిగినప్పటికీ వాటిపై అస్పష్టమైన సమాచారం ఇచ్చారా? అనే అంశాలను విచారణలో తేల్చాలి.

**వివరణలతో సరిపెట్టకుండా వాస్తవాలను వెల్లడించాలి!**

అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధి కోసం కేటాయించిన నిధులు ప్రజాధనం. వాటి వినియోగంపై ప్రజలకు స్పష్టమైన సమాచారం అందించడం అధికారుల బాధ్యత. చెల్లింపులు జరగలేదని చెబితే దానికి సంబంధించిన రికార్డులు చూపాలి; చెల్లింపులు జరిగి ఉంటే వాటి వివరాలను వెల్లడించాలి. ఆరోపణలు నిజమని ముందుగానే నిర్ధారించకుండా, వాస్తవాలను స్వతంత్ర విచారణ ద్వారా తేల్చాలి. తప్పులు నిర్ధారణ అయితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. ఈ వ్యవహారంపై ఉన్న సందేహాలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత సంబంధిత అధికారులదే.

# పుట్టిన ఊరిపై మమకారంతో

## చిన్నారులకు ఉచితంగా మందులు




- **అమెరికా నుంచి వచ్చి వైద్యసేవలు అందించిన డాక్టర్ నేరెళ్ల దామోదర్**
- **దుర్గామాత సన్నిధిలో ప్రత్యేక పూజలు.. గ్రామ ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా సేవలు**

**(జమ్మికుంట జోర్దార్ ప్రతినిధి)**పుట్టిన ఊరిపై మమకారంతో అమెరికా నుంచి వచ్చిన డాక్టర్ నేరెళ్ల దామోదర్ మడిపల్లి గ్రామంలో చిన్నారులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. జమ్మికుంట మండలంలోని మడిపల్లి గ్రామంలో ఇండియన్ అమెరికన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం దుర్గామాత ఆలయం సమీపంలోని శివాలయం వద్ద ఈ కార్యక్రమం నిర్వహించారు. 0 నుంచి 16 ఏళ్లలోపు చిన్నారులకు కాలానుగుణ వ్యాధులకు సంబంధించిన మందులను ఉచితంగా అందజేశారు.

గతంలోనూ మడిపల్లి గ్రామంలో వివిధ వైద్య నిపుణులతో వైద్య శిబిరం నిర్వహించి, రోగ నిర్ధారణ పరీక్షలతోపాటు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఉన్నత స్థాయికి ఎదిగినప్పటికీ పుట్టిన ఊరును మరిచిపోకుండా అమెరికా నుంచి వచ్చి గ్రామంలోని చిన్నారులకు వైద్యసేవలు అందించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా డాక్టర్ నేరెళ్ల దామోదర్ మాట్లాడుతూ, తాను పుట్టి పెరిగిన గ్రామాన్ని ఎప్పటికీ మరిచిపోనని తెలిపారు. గ్రామానికి వైద్యపరంగానే కాకుండా ఇతర మౌలిక అవసరాల విషయంలోనూ తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు. దుర్గామాత ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, పాడిపంటలతో గ్రామం సుభిక్షంగా వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

అనంతరం వేద పండితుడు రాజగోపాల్ ఆధ్వర్యంలో దుర్గామాత అమ్మవారికి అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజలతో ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచి పోషిని సత్యనారాయణ, శ్రీ దుర్గాభవాని అసోసియేషన్ సభ్యులు, భవాని స్వాములు, భక్తులు, చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# రామగుండంలో ఈఎస్ఐ ఆసుపత్రి ఎక్కడ?

## పనులు ఎప్పుడు ప్రారంభం?

- **కలెక్టర్‌ను వివరణ కోరిన ఎంపీ వంశీకృష్ణ!**
- **కార్మికుల ఆరోగ్యానికి పెద్దపీట.. భూమి కేటాయింపు నుంచి నిర్మాణ అనుమతుల వరకు పూర్తి వివరాలు ఇవ్వాలని డిమాండ్**



VAMSI KRISHNA GADDAM
MEMBER OF PARLIAMENT
LOK SABHA
PEDDAPALLI CONSTITUENCY

Ph. No: 8008292924

Date: 11 October 2026

Lr No. 1314 /11-10-2026/ Delhi.

To,
The District Collector
Peddapalli District, Telangana

Subject: Urgent clarification on land allotment, approvals and ground-level progress of the proposed ESI Hospital

Sir,

The establishment of an ESI Hospital in the Ramagundam industrial region is essential to improving healthcare access for insured industrial workers and their families.

I have raised this matter with the concerned authorities and publicly reiterated the requirement on 8- April -2026.

I request the following information:

1. Has land been identified for the proposed ESI Hospital? Provide the survey number, extent and location.
2. Has the land been formally allotted or transferred to ESIC?
3. On what dates were the relevant proposals forwarded by the district administration?
4. Has any administrative or financial sanction been issued? If so, provide the date, order number and amount.
5. What approvals, NOCs or land-related actions are pending?
6. What is the present ground status, and when can construction commence?

Please identify the exact stage at which the project is pending and the steps your office has taken to resolve it.

A detailed Action Taken Report may kindly be furnished within seven days.

Yours sincerely,

Vamsi Krishna Gaddam
MP, Peddapalli Constituency

Member of Consultative Committee for the Ministry of Heavy Industries
Member of Standing Committee - Science and Technology

33, Ferozeshah Road, New Delhi - 110001
Email: vamsi.gaddam@sansad.nic.in, Phone No: 8008292924

**(రామగుండం జోర్దార్ ప్రతినిధి)** రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో కార్మికులు, వారి కుటుంబాలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రతిపాదించిన ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటులో పురోగతిపై పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ జిల్లా కలెక్టర్‌ను వివరణ కోరారు. ఆసుపత్రి నిర్మాణానికి భూమి గుర్తింపు, కేటాయింపు, పరిపాలనా అనుమతులు, నిధుల మంజూరు, నిర్మాణ పనుల ప్రస్తుత స్థితిపై సమగ్ర వివరాలు అందించాలని కోరారు.

ఆసుపత్రి కోసం భూమి గుర్తించారా?
సర్వే నంబర్, విస్తీర్ణం, స్థలం వివరాలేమిటి?
భూమిని అధికారికంగా ఈఎస్ఐకి బదిలీ చేశారా?
జిల్లా యంత్రాంగం నుంచి ప్రతిపాదనలు ఎప్పుడు పంపించారు?
పరిపాలనా లేదా ఆర్థిక అనుమతులు మంజూరయ్యాయా?
ఇంకా ఏ అనుమతులు పెండింగ్‌లో ఉన్నాయి?
అనే అంశాలపై స్పష్టత ఇవ్వాలని ఎంపీ కోరారు.

రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని కార్మికులకు సకాలంలో మెరుగైన వైద్యం అందించడంలో ఈఎస్ఐ ఆసుపత్రి కీలక పాత్ర పోషిస్తుందని ఎంపీ వంశీకృష్ణ పేర్కొన్నారు.

ప్రాజెక్టు ఏ దశలో నిలిచిపోయిందో గుర్తించి, పెండింగ్ సమస్యల పరిష్కారానికి తీసుకున్న చర్యలను వెల్లడించాలని సూచించారు. కార్మికుల ఆరోగ్య భద్రతకు కీలకమైన ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటులో జాప్యానికి కారణాలేమిటో స్పష్టం చేయాలి..

నిర్మాణ పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయో వెల్లడించాలి అని కోరుతూ, ఏడు రోజుల్లో సమగ్ర కార్యాచరణ నివేదిక అందించాలని ఎంపీ గడ్డం వంశీకృష్ణ జిల్లా కలెక్టర్‌ను కోరారు.

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం

# మంత్రి పొన్నం ప్రభాకర్ గారూ..
# కరీంనగర్ ఐటీఐని పట్టించుకోరా?

- ఆరు ట్రేడ్లకు ఏటీఓ పోస్టులు మంజూరు శూన్యం
- ఏళ్ల తరబడి ఖాళీగా నాలుగు డీటీఓ పోస్టులు.. ఔట్‌సోర్సింగ్ సిబ్బందితోనే బోధన
- బోధకుల కొరతతో విద్యార్థులకు నష్టం.. పట్టించుకోని పాలకులు!




**(ఉమ్మడి కరీంనగర్ జిల్లా జోర్దార్ ప్రతినిధి)** ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు విద్యా, వైజ్ఞానిక రంగాల్లో ప్రత్యేక గుర్తింపు ఉన్నప్పటికీ.. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)లో మాత్రం బోధకుల కొరత విద్యార్థులకు శాపంగా మారుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆరు కీలక ట్రేడ్లకు సంబంధించి అసిస్టెంట్ ట్రైనింగ్ ఆఫీసర్ (ఏటీఓ) పోస్టులు మంజూరు కాకపోవడం, ఇప్పటికే మంజూరైన నాలుగు డిప్యూటీ ట్రైనింగ్ ఆఫీసర్ (డీటీఓ) పోస్టులు సైతం ఏళ్ల తరబడి ఖాళీగా ఉండటంతో శిక్షణ నాణ్యతపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. విద్యార్థులకు నైపుణ్య శిక్షణ అందించాల్సిన సంస్థలోనే బోధకుల కొరత నెలకొనడం ఏమిటని విద్యార్థి సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. ఈ పరిస్థితిపై రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక దృష్టి సారించాలని విద్యార్థులు, పట్టణవాసులు కోరుతున్నారు.

**ఆరు ట్రేడ్లు.. బోధకుల పోస్టులు శూన్యం!**

కరీంనగర్ ప్రభుత్వ ఐటీఐలో ఎలక్ట్రీషియన్, వెల్డర్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, డ్రాఫ్ట్స్‌మన్ సివిల్, డ్రెస్ మేకింగ్, కోపా (కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్) వంటి ఆరు ట్రేడ్లకు ఏటీఓ పోస్టులు మంజూరు కాలేదని సమాచారం. ఈ కోర్సుల్లో శిక్షణ పొందే విద్యార్థులకు పూర్తిస్థాయిలో బోధకులు అందుబాటులో లేకపోవడం సమస్యగా మారిందని విద్యార్థి సంఘాలు పేర్కొంటున్నాయి. దశాబ్దాలుగా ఈ సమస్య కొనసాగుతున్నా పరిష్కారానికి నోచుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సాంకేతిక విద్యలో నైపుణ్యాలు సాధించి ఉద్యోగావకాశాలు పొందాల్సిన విద్యార్థులు సరైన బోధనకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**నాలుగు డీటీఓ పోస్టులూ ఖాళీనే!**

సంస్థలో నాలుగు డీటీఓ పోస్టులు మంజూరై ఉన్నప్పటికీ, అవి కూడా చాలా కాలంగా ఖాళీగా ఉన్నట్లు తెలుస్తోంది. బోధన, శిక్షణ పర్యవేక్షణకు కీలకమైన పోస్టులు ఖాళీగా ఉండటంతో విద్యార్థులకు నాణ్యమైన శిక్షణ అందించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు, రాష్ట్రంలోని పలు ప్రభుత్వ ఐటీఐల్లో సిబ్బంది అందుబాటులో ఉన్నప్పటికీ, కరీంనగర్ సంస్థలో మాత్రం అవసరమైన పోస్టులు భర్తీ కాకపోవడం అధికారుల దృష్టికి తీసుకెళ్లాల్సిన అంశమని స్థానికులు అంటున్నారు.

**15 యూనిట్లు.. ఔట్‌సోర్సింగ్ సిబ్బందితోనే బోధనా?**

కరీంనగర్ ఐటీఐలో ఆరు ట్రేడ్లకు సంబంధించి 15 యూనిట్లు ఉన్నట్లు సంబంధిత అధికారులు పేర్కొంటున్నారని సమాచారం. అయితే, ఆయా యూనిట్లలో బోధకుల కొరతను అధిగమించేందుకు ఔట్‌సోర్సింగ్ సిబ్బందితోనే నెట్టుకొస్తున్నారని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. పూర్తిస్థాయి బోధకులు లేకపోవడంతో పాఠ్యాంశాలను సమగ్రంగా అర్థం చేసుకోవడంలో విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెబుతున్నాయి. పారిశ్రామిక శిక్షణలో సిద్ధాంత పాఠాలతోపాటు ప్రాయోగిక నైపుణ్యాలు ఎంతో కీలకం. అలాంటి విద్యలోనే బోధకుల కొరత ఉంటే విద్యార్థులు ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలను ఎలా సాధిస్తారన్న ప్రశ్న తలెత్తుతోంది.

**సిబ్బంది సర్దుబాటులోనూ లోపాలున్నాయా?**

రాష్ట్రంలోని 65 ప్రభుత్వ ఐటీఐల్లో సిబ్బంది హేతుబద్ధీకరణ చేపట్టకపోవడం వల్ల కొన్ని సంస్థల్లో విద్యార్థుల సంఖ్యకు మించి ఉద్యోగులు ఉండగా, మరికొన్ని సంస్థల్లో సిబ్బంది కొరత నెలకొంటోందని విమర్శలు వినిపిస్తున్నాయి. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పాత ప్రభుత్వ ఐటీఐకి చెందిన కొందరు ఉద్యోగులు పెద్దపల్లి, వరంగల్ ప్రాంతాలకు డిప్యూటేషన్‌పై వెళ్లినట్లు ఆరోపణలు ఉన్నాయి. సిబ్బంది అవసరాలు, విద్యార్థుల సంఖ్య, ట్రేడ్ల వారీగా పోస్టుల వివరాలను సమగ్రంగా పరిశీలించి హేతుబద్ధీకరణ చేపడితే ఇలాంటి సమస్యలకు పరిష్కారం లభించే అవకాశం ఉందని విద్యార్థి సంఘాలు అభిప్రాయపడుతున్నాయి.

**మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించేనా?**

కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐలో ఆరు ట్రేడ్లకు అవసరమైన ఏటీఓ పోస్టులు మంజూరు చేయాలని, ఖాళీగా ఉన్న నాలుగు డీటీఓ పోస్టులను భర్తీ చేయాలని విద్యార్థి సంఘాలు, పట్టణవాసులు కోరుతున్నారు. అవసరమైతే డిప్యూటేషన్‌పై సిబ్బందిని సర్దుబాటు చేసి తాత్కాలికంగా బోధకుల కొరతను అధిగమించాలని సూచిస్తున్నారు. ఈ సమస్యపై సంబంధిత శాఖ ఉన్నతాధికారులు, మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.
సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేపడతామని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# ఘనంగా విజయదశమి వేడుకలు
## వీణవంకలో రావణ దహనం



- అంగరంగ వైభవంగా పాడి శాలిని రెడ్డి జన్మదిన వేడుకలు

**(హుజూరాబాద్/వీణవంక, జోర్దార్ ప్రతినిధి)** హుజూరాబాద్ నియోజకవర్గంలో విజయదశమి వేడుకలు అంబరాన్నంటాయి. హుజూరాబాద్ పట్టణంలోని హైస్కూల్ మైదానంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆధ్వర్యంలో విజయదశమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం వీణవంక మండల కేంద్రంలో నిర్వహించిన విజయదశమి వేడుకల్లో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పాల్గొని రావణ దహనం నిర్వహించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిర్వహించిన ఈ కార్యక్రమం ప్రజల్లో ఉత్సాహాన్ని నింపింది.



**వైభవంగా శాలిని రెడ్డి జన్మదిన వేడుకలు**

వీణవంకలో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి సతీమణి పాడి శాలిని రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు, నియోజకవర్గ నేతలు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# బెండకాయ జిగురు మంచిదేనా?
## జీర్ణక్రియ, కొలెస్ట్రాల్‌పై కీలక విషయాలు!



భారతీయ వంటగదుల్లో బెండకాయకు ప్రత్యేక స్థానం ఉంది. బెండకాయ వేపుడు నుంచి కూరల వరకు అనేక రకాలుగా దీనిని వండుకుని తింటారు.

రుచితోపాటు వివిధ వంటకాల్లో ఉపయోగించుకునే వీలుండడంతో చాలామంది బెండకాయను ఇష్టపడతారు. అయితే, బెండకాయలో ఉండే జిగురు స్వభావం కొందరికి నచ్చదు. ఆ జిగురును తొలగించేందుకు ప్రయత్నిస్తుంటారు. కానీ, అదే జిగురు ఆరోగ్యానికి కొన్ని ప్రయోజనాలను అందిస్తుందని నిపుణులు చెబుతున్నారు. బెండకాయలో నీటితో కలిసినప్పుడు జెల్ తరహా పదార్థంగా మారే కరిగే పీచు పదార్థం ఉంటుంది. దీనిని మ్యూసిలేజ్ అంటారు. బెండకాయ జిగురుగా ఉండడానికి ఇదే కారణం. ఈ రకమైన పీచు పదార్థం జీర్ణక్రియకు, ప్రేగుల కదలికలు సక్రమంగా సాగడానికి సహాయపడుతుంది. అలాగే పేగుల్లోని సూక్ష్మజీవుల ఆరోగ్యాన్ని కాపాడడంలో, కొలెస్ట్రాల్ నియంత్రణలోనూ కీలకపాత్ర పోషించే అవకాశం ఉంది. అందువల్ల బెండకాయ కేవలం సాధారణ కూరగాయ మాత్రమే కాదు.. ఆరోగ్యకరమైన ఆహారంలో భాగంగా ఉపయోగపడుతుంది.

**జీర్ణక్రియ, కొలెస్ట్రాల్ నిర్వహణకు దోహదం..**

ఎయిమ్స్, హార్వర్డ్, స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయాల్లో శిక్షణ పొందిన గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ సౌరభ్ సేథి బెండకాయలోని జిగురు వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ పోస్టును పంచుకున్నారు.

బెండకాయ జిగురు జీర్ణక్రియకు, కొలెస్ట్రాల్ నిర్వహణకు ఏ విధంగా తోడ్పడుతుందో ఆయన వివరించారు.

డాక్టర్ సౌరభ్ సేథి వివరాల ప్రకారం, బెండకాయలోని మ్యూసిలేజ్‌లో కరిగే పీచు పదార్థం ఉంటుంది. ఇది జీర్ణక్రియ సక్రమంగా సాగడానికి, ప్రేగుల కదలికలు క్రమబద్ధంగా ఉండడానికి సహాయపడుతుంది. పీచు పదార్థం మలానికి తగిన పరిమాణాన్ని అందించి, జీర్ణవ్యవస్థలో అది ముందుకు కదలడానికి తోడ్పడుతుంది. తగినంత పీచు పదార్థం తీసుకోవడం వల్ల మలబద్ధకం సమస్యను నివారించడంలోనూ ప్రయోజనం ఉంటుంది. మన జీర్ణవ్యవస్థలో నివసించే వివిధ రకాల సూక్ష్మజీవుల సముదాయాన్ని గట్ మైక్రోబయోమ్ అంటారు. వీటిలో కొన్ని సూక్ష్మజీవులు ఆహారం ద్వారా లభించే పీచు పదార్థాన్ని వినియోగించుకుంటాయి. అందువల్ల పీచు పదార్థం సమృద్ధిగా ఉండే బెండకాయ వంటి ఆహారాలను సమతుల్య ఆహారంలో భాగంగా తీసుకోవడం పేగుల ఆరోగ్యానికి మేలు చేస్తుంది.

**అధ్యయనాల్లో ఆసక్తికర విషయాలు..**

బెండకాయకు సంబంధించి ప్రయోగశాలల్లో, జంతువులపై నిర్వహించిన కొన్ని అధ్యయనాల్లో ఆసక్తికరమైన విషయాలు వెల్లడయ్యాయని డాక్టర్ సేథి పేర్కొన్నారు.

ఈ అధ్యయనాల ప్రకారం, బెండకాయలోని పదార్థాలు పిత్త ఆమ్లాలను బంధించి, వాటిని మలం ద్వారా శరీరం నుంచి బయటకు పంపించడంలో సహాయపడతాయి. పిత్త ఆమ్లాలను కాలేయం కొలెస్ట్రాల్‌ను ఉపయోగించి తయారు చేస్తుంది. ఇవి శరీరంలో కొవ్వుల జీర్ణక్రియకు అవసరం.

పిత్త ఆమ్లాలు ఎక్కువగా శరీరం నుంచి బయటకు వెళ్లినప్పుడు, వాటి స్థానంలో కొత్త పిత్త ఆమ్లాలను తయారు చేయడానికి కాలేయం మరింత కొలెస్ట్రాల్‌ను వినియోగించుకుంటుంది. కరిగే పీచు పదార్థం కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో తోడ్పడే మార్గాల్లో ఇదొకటి. అయితే, ఈ అధ్యయనాల ఆధారంగా బెండకాయ తినడం వల్ల కచ్చితంగా కొలెస్ట్రాల్ తగ్గుతుందని చెప్పలేం. మనుషుల్లో బెండకాయ తీసుకోవడం వల్ల కలిగే ప్రభావాలను స్పష్టంగా తెలుసుకోవడానికి మరిన్ని పరిశోధనలు అవసరం.

**జిగురే కీలకం..**

బెండకాయలోని జిగురు కారణంగా చాలామంది ఈ కూరగాయకు దూరంగా ఉంటారు. కానీ, ఆ జిగురే కొన్ని ఆరోగ్య ప్రయోజనాలకు సంబంధం కలిగి ఉంటుందని నిపుణులు వివరిస్తున్నారు. కాబట్టి జిగురు ఉందనే కారణంతో బెండకాయను పూర్తిగా పక్కన పెట్టకుండా, రోజువారీ ఆహారంలో భాగంగా చేర్చుకోవచ్చు. బెండకాయను మసాలాలతో వేయించి తినవచ్చు. సాధారణ కూరగా వండుకోవచ్చు లేదా వివిధ రకాల కూరల్లో చేర్చుకోవచ్చు.

సమతుల్య ఆహారంలో భాగం గా బెండకాయను తీసుకోవడం ద్వారా దానిలోని పీచు పదార్థం ప్రయోజనాలను పొందవచ్చు

# ఓదెలలో ఆగిన ఆడబిడ్డల భూ పట్టా

- పెద్దపెల్లి ఎమ్మెల్యే తీరుపై ఆరోపణల జోరు
- కూతుర్లకు చెరో ఎకరం ఇద్దామంటే అడ్డుకున్నారంటూ కుటుంబం ఆవేదన
- ఫోన్ కాల్ తోనే రిజిస్ట్రేషన్ నిలిపివేశారన్న ప్రచారం - నిజానిజాలు తేల్చాలని డిమాండ్
- రాజ్యాంగం ఇచ్చిన హక్కును కాలరాయవద్దంటున్న మహిళా లోకం




**(వరంగల్ జోర్దార్ ప్రతినిధి)**

పెద్దపల్లి నియోజకవర్గంలోని ఓదెల మండలంలో రూపునారాయణపేట గ్రామంలోఒక భూమి రిజిస్ట్రేషన్ వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కన్న కూతుర్లకు తల్లిదండ్రులు ఇస్తున్న ఆస్తి పంపకాన్ని అడ్డుకున్నారంటూ వస్తున్న ఆరోపణలు స్థానికంగా కలకలం రేపుతున్నాయి.

**అసలు జరిగిందేమిటంటే – బాధితుల కథనం ప్రకారం:**

రూపనారాయణపేటకు చెందిన మాజీ ఎంపీటీసీ బొంగోని సుగుణ – నారాయణ దంపతులకు 9 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అందులో 4.20 ఎకరాలు ఇప్పటికే వారి కుమారునికి పట్టా చేసినట్లు సమాచారం. మిగిలిన భూమి నుండి తమ ఇద్దరు కుమార్తెలకు చెరో ఎకరం చొప్పున ఇచ్చేందుకు వారు నిర్ణయించుకుని, ప్రభుత్వ చలానా చెల్లించి, స్లాట్ బుక్ చేసుకుని, దస్తావేజులతో కుమార్తెలతో కలిసి ఓదెల తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లినట్లు బాధిత కుటుంబం చెబుతోంది.అయితే అక్కడ రిజిస్ట్రేషన్ ప్రక్రియ మధ్యలోనే ఆగిపోయిందని, దీని వెనుక సంబంధిత నియోజకవర్గ ఎమ్మెల్యే జోక్యం ఉందన్న ఆరోపణ వారి నుండి వినిపిస్తోంది. ఎమ్మెల్యే నుండి తహసీల్దార్‌కు ఫోన్ వచ్చిన తర్వాతే ప్రక్రియ నిలిచిపోయిందని బాధితులు ఆరోపిస్తున్నారన్న ప్రచారం స్థానికంగా జరుగుతోంది.


Government of Telangana
Tahsildar & Jt. Sub Registrar Office,Odela ,Peddapalli

**Slot Booking & Advisory**

Dear Shri/Smt./Kumari BONGONI SUGUNA, Shri/Smt./Kumari PAIDIMALLA SWAPNA, your request for Registration is accepted. The Seller, Buyer and the Witnesses are to be present at the assigned time and location as under :

| | | | | | |
|---|---|---|---|---|---|
| Date | 29/09/2026 | Time | 10:45 AM | Application No. | 2600637884 |
| Tahsildar & Jt. Sub Registrar Office office address | | | | MRO Office - Odela | |

List of Documents to be carried for Registration :

a. PPB of Seller
b. PPB of Buyer (if available)
c. Original Document to be registered
d. Original eStamps e-Challan
e. Form 61 / Form 60 / PAN CARD of Seller
f. Form 61 / Form 60 / PAN CARD of Buyer
g. Aadhaar card of the following :
i. Seller
ii. Buyer
iii. Witness 1
iv. Witness 2

Tahsildar & Jt. Sub Registrar Office,
Odela ,Peddapalli

**అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉంది:**

ఈ ఆరోపణలపై సంబంధిత తహసీల్దార్ కార్యాలయం నుండి గానీ, సంబంధిత ఎమ్మెల్యే కార్యాలయం నుండి గానీ ఇప్పటివరకు అధికారిక వివరణ వెలువడలేదు. సాంకేతిక కారణంతో ఆగిందా, డాక్యుమెంట్లలో లోపమా, లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అనేది రికార్డుల పరిశీలన, విచారణ తర్వాతే స్పష్టమవుతుంది.ఒకవేళ ప్రజాప్రతినిధి స్థాయి నుండి నిజంగానే ఒత్తిడి వచ్చి ఉంటే అది తీవ్రమైన అంశమని, జిల్లా ఉన్నతాధికారులు వెంటనే విచారణ జరిపి వాస్తవాలను బయటపెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

**మహిళా సంఘాల ఆగ్రహం:**

రాజ్యాంగం కల్పించిన హక్కు ప్రకారం కుమార్తెలకు ఆస్తిలో సమాన హక్కు ఉందని, తల్లిదండ్రులు స్వచ్ఛందంగా ఇస్తున్న ఆస్తిని అడ్డుకోవడం సరైన పద్ధతి కాదని మహిళా సంఘాల నేతలు అభిప్రాయపడుతున్నారు. బాధిత ఆడబిడ్డలకు న్యాయం జరిగేలా, నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.



# స్మృతి మంధాన రికార్డును బద్దలు కొట్టిన హర్మన్‌ప్రీత్ కౌర్.




జింబాబ్వేతో మూడో, చివరి టీ20లో భారత్ 92 పరుగుల భారీ విజయం సాధించింది. ఈ విజయంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను భారత్ 3-0తో క్లీన్ స్వీప్ చేసింది. ఈ మ్యాచ్‌లో మాజీ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ అద్భుత ఇన్నింగ్స్ ఆడింది. కేవలం 41 బంతుల్లో 91 పరుగులతో అజేయంగా నిలిచి భారత్ భారీ స్కోరు సాధించడంలో కీలక పాత్ర పోషించింది.హర్మన్‌ప్రత్ ఇన్నింగ్స్‌లో 10 ఫోర్లు, 5 సిక్సర్లు ఉన్నాయి. ఆమె ధాటికి భారత్ 20 ఓవర్లలో 216/7 పరుగులు చేసింది. అంతకుముందు షఫాలీ వర్మ ( 37 బంతుల్లో 69 పరుగులతో మెరుపు ఇన్నింగ్స్ ఆడింది.భారీ లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన జింబాబ్వే 20 ఓవర్లలో 124/7 మాత్రమే చేయగలిగింది. దీంతో భారత్ 92 పరుగుల తేడాతో ఘన విజయం అందుకుంది.స్మృతి మంధాన రికార్డు బద్దలు..హర్మన్‌ప్రీత్ కౌర్ 91 పరుగులు చేయడంతో మరో ప్రత్యేక రికార్డు ఆమె ఖాతాలో చేరింది. స్వదేశంలో భారత మహిళల తరఫున టీ20ల్లో అత్యధిక వ్యక్తిగత స్కోరు చేసిన బ్యాటర్‌గా హర్మన్‌ప్రీత్ నిలిచింది.ఇప్పటివరకు ఈ రికార్డు స్మృతి మంధాన పేరిట ఉంది. 2025లో శ్రీలంకపై మంధాన 48 బంతుల్లో 80 పరుగులు చేసింది. ఇప్పుడు హర్మన్‌ప్రీత్ 91 పరుగులతో ఆ రికార్డును అధిగమించింది.స్వదేశంలో భారత మహిళల టీ20ల్లో అత్యధిక స్కోర్లు..- - హర్మన్‌ప్రీత్ కౌర్ -- 91 (41 బంతులు, 10 ఫోర్లు, 5 సిక్సర్లు)లి జం జింబాబ్వే, రాయ్‌పూర్, అక్టోబర్ 20, 2026-- స్మృతి మంధాన -- 80 (48 బంతులు, 11 ఫోర్లు, 3 సిక్సర్లు) జం శ్రీలంక, తిరువనంతపురం, డిసెంబర్ 28, 2025-- షఫాలీ వర్మ -- 79 (42 బంతులు, 11 ఫోర్లు, 3 సిక్సర్లు)లి జం శ్రీలంక, తిరువనంతపురం, డిసెంబర్ 26, 2025-- స్మృతి మంధాన -- 79 (49 బంతులు, 9 ఫోర్లు, 4 సిక్సర్లు) జం ఆస్ట్రేలియా, నవీ ముంబై, డిసెంబర్ 11, 2022-- షఫాలీ వర్మ -- 79 (46 బంతులు, 12 ఫోర్లు, 1 సిక్సర్) జం శ్రీలంక, తిరువనంతపురం, డిసెంబర్ 28, 2025షఫాలీతో కలిసి భారత్‌కు అదిరిపోయే ఆరంభంకెప్టెన్ స్మృతి మంధాన ఈ మ్యాచ్‌లో బ్యాటింగ్‌కు దిగకుండా ఇతర బ్యాటర్లకు ఎక్కువ సమయం ఇవ్వాలని నిర్ణయించుకుంది. దీంతో షఫాలీ వర్మతో కలిసి అనుష్క శర్మ (ఓపెనర్‌గా వచ్చింది.అనుష్క 20 బంతుల్లో 28 పరుగులు చేసింది. షఫాలీ వరుసగా రెండో అర్ధసెంచరీ నమోదు చేస్తూ భారత్ స్కోరును వేగంగా పెంచింది. వీరిద్దరూ కలిసి కేవలం 32 బంతుల్లో 54 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు.

# మీకు తెలియకుండా బ్యాంక్ అకౌంట్లో డబ్బులు కట్ అయ్యాయా..?




భారత స్టాక్ మార్కెట్‌లో కొన్ని కంపెనీల షేర్లు దీర్ఘకాలంలో అద్భుతమైన రాబడులను అందిస్తూ ఇన్వెస్టర్ల దృష్టిని ఆకర్షిస్తుంటాయి. అలాంటి కంపెనీల్లో ఒకటి. కండోమ్‌లు, ఇతర నిరోధక ఉత్పత్తులను తయారు చేసే ఈ కంపెనీ షేరు గత పదేళ్లలో సుమారు 14,057 శాతం రాబడిని అందించినట్లు నివేదికలు చెబుతున్నాయి. దీంతో ఈ స్టాక్ మరోసారి మార్కెట్‌లో చర్చనీయాంశంగా మారింది.

కుపిడ్ లిమిటెడ్ అంటే ఏమిటి?కుపిడ్ లిమిటెడ్ భారతదేశానికి చెందిన ఒక తయారీ సంస్థ. ఈ కంపెనీ పురుషుల కండోమ్‌లు, మహిళల కండోమ్‌లు, నీటి ఆధారిత లూబ్రికెంట్ జెల్లీ, వైద్య పరీక్షలకు ఉపయోగించే ×ఎణ కిట్లను తయారు చేస్తుంది. కంపెనీకి స్వంత పరిశోధన, అభివృద్ధి కేంద్రం కూడా ఉంది. అంతర్జాతీయ మార్కెట్లలోనూ తన ఉత్పత్తులను విక్రయిస్తోంది.పదేళ్లలో 14,057 శాతం రాబడి.. ఎంత పెరిగింది?కుపిడ్ లిమిటెడ్ షేరు పదేళ్ల కాలంలో సుమారు 14,057 శాతం రాబడిని అందించింది. అంటే, షేరు ధరలో వచ్చిన పెరుగుదల దీర్ఘకాలిక ఇన్వెస్టర్లకు గణనీయమైన లాభాలను అందించింది. అయితే, ఈ రాబడి గత పనితీరుకు సంబంధించినది మాత్రమే. భవిష్యత్తులోనూ ఇదే స్థాయిలో లాభాలు వస్తాయని హామీ లేదు.కుపిడ్ లిమిటెడ్ షేరు బీఎస్ఈలో సుమారు 3 శాతం పెరిగి రూ.368 స్థాయిలో కొత్త గరిష్ఠాన్ని తాకింది.కాలవ్యవధి నివేదించిన షేరు పెరుగుదల, రాబడి

ఒక నెలలో సుమారు 28%, ఆరు నెలల్లో 289% కంటే ఎక్కువ, అదే ఒక సంవత్సరంలో 650% కంటే ఎక్కువ, రెండు సంవత్సరాలలో సుమారు 2,121%, మూడు సంవత్సరాలలో సుమారు 8,605%, ఐదు సంవత్సరాలలో సుమారు 15,301% శాతం పెరుగుదల నమోదైనట్లు కంపెనీ నివేదికలు చెబుతున్నాయి. కండోమ్‌లు, ఇతర వ్యక్తిగత ఆరోగ్య ఉత్పత్తులను తయారు చేసే కుపిడ్ లిమిటెడ్ షేరు గత పదేళ్లలో అందించిన భారీ రాబడితో ఇన్వెస్టర్ల దృష్టిని ఆకర్షించింది. అయితే, గతంలో వచ్చిన లాభాలు భవిష్యత్తులోనూ వస్తాయని చెప్పలేం. పెట్టుబడి పెట్టే ముందు పూర్తి వివరాలను పరిశీలించి, అవసరమైతే ఆర్థిక సలహాదారుని సంప్రదించాలి.బోనస్ షేర్లను ఎప్పుడు, ఎక్కడ ఇచ్చారు?

ఈ కంపెనీ తన వాటాదారులను చాలా సంతోషపెట్టింది. ఈ కంపెనీ మార్చి 2026లో ఒక షేరుకు 4 (1:4) బోనస్ షేర్లను ఇచ్చింది. అంతకుముందు, 2024లో 1:1 నిష్పత్తిలో, 2018లో 5:1 నిష్పత్తిలో బోనస్ షేర్లను ఇచ్చారు.

# 60 ఏళ్ల తర్వాత తొలిసారి.. ఆస్ట్రేలియాపై మార్కో జాన్సెన్ అరుదైన రికార్డ్..!




ఆస్ట్రేలియాతో జరుగుతున్న రెండో టెస్టు మూడో రోజు మార్కో జాన్సెన్ అద్భుత బ్యాటింగ్‌తో ప్రత్యేక రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. దక్షిణాఫ్రికా 110/6తో కష్టాల్లో ఉన్న సమయంలో నంబర్ 8 స్థానంలో క్రీజులోకి వచ్చిన జాన్సెన్.. కెప్టెన్ టెంబా బవుమాతో కలిసి కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు.ఇద్దరూ కలిసి 132 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్‌ను తిరిగి గాడిలో పెట్టారు. జాన్సెన్ 100 బంతుల్లో 85 పరుగులు చేశాడు. ఇందులో అతని బ్యాటింగ్ ఎంతో కీలకంగా నిలిచింది. అయితే సెంచరీకి చేరువైన సమయంలో స్కాట్ బోలాండ్ బౌలింగ్‌లో ట్రావిస్ హెడ్‌కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు.60 ఏళ్ల నాటి రికార్డు బద్దలు..జాన్సన్ 85 పరుగులు చేయడంతో స్వదేశంలో ఆస్ట్రేలియాపై టెస్టుల్లో దక్షిణాఫ్రికా నంబర్ 8 బ్యాటర్‌గా అత్యధిక స్కోరు చేసిన ఆటగాడిగా నిలిచాడు.ఇంతకుముందు ఈ రికార్డు పీటర్ వాన్ డెర్ మెర్వే పేరిట ఉండేది. 1966లో జోహన్నెస్‌బర్గ్‌లో ఆస్ట్రేలియాపై ఆయన 76 పరుగులు చేశారు. ఇప్పుడు జాన్సెన్ 85 పరుగులతో ఆ దాదాపు ఆరు దశాబ్దాల నాటి రికార్డును అధిగమించాడు.ఆస్ట్రేలియాపై టెస్టుల్లో నంబర్ 8గా అత్యధిక స్కోర్లు..అయితే ఆస్ట్రేలియాపై టెస్టు ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా నంబర్ 8 బ్యాటర్‌గా అత్యధిక స్కోరు చేసే రికార్డును జాన్సెన్ అందుకోలేకపోయాడు.ఈ జాబితాలో బ్రయాన్ మెక్‌మిలన్ అగ్రస్థానంలో ఉన్నాడు. 1998లో అడిలైడ్ ఓవల్‌లో ఆయన అజేయంగా 87 పరుగులు చేశాడు. జాన్సెన్ 85 పరుగులతో రెండో స్థానంలో నిలిచాడు.బవుమా కూడా అరుదైన రికార్డు...మార్కో జాన్సెన్‌తో పాటు దక్షిణాఫ్రికా కెప్టెన్ టెంబా బవుమా కూడా ఈ మ్యాచ్‌లో ప్రత్యేక రికార్డు సాధించాడు. ఆస్ట్రేలియాపై వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (ఔజ) మ్యాచ్‌లో సెంచరీ చేసిన అత్యంత పెద్ద వయసున్న కెప్టెన్‌గా బవుమా నిలిచాడు.మ్యాచ్ ప్రారంభమైన సమయంలో బవుమా వయసు 36 సంవత్సరాల 154 రోజులు. దీంతో 2023లో నాగ్‌పూర్ టెస్టులో 35 సంవత్సరాల 285 రోజుల వయసులో సెంచరీ చేసిన రోహిత్ శర్మ (=శీష్త్రఙ జాష్ట్రుతీమ్ఖు) రికార్డును అతను అధిగమించాడు.

# ఒప్పో ఎఫ్-సిరీస్ 10 ఏళ్ల పండుగ.. మార్కెట్లోకి అదిరిపోయే ఒప్పో ఫీ35 5జీ సిరీస్ మోడళ్లు!




స్మార్ట్‌ఫోన్ రష్యా మార్కెట్‌లో తనదైన స్టైల్, అత్యాధునిక కెమెరా ఫీచర్లతో మంచి ఆదరణ పొందిన ఒప్పో (ూూూూ) సంస్థ భారత మార్కెట్‌లో ఒక అరుదైన మైలురాయిని చేరుకుంది. భారత్‌లోకి ఒప్పో ఎఫ్ సిరీస్ అడుగుపెట్టి 10 ఏళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని కొత్తగా ూూూూ ఫీ35 ూవతీఅవం స్మార్ట్‌ఫోన్‌లను అధికారికంగా లాంచ్ చేసింది. ఈ లైనప్‌లో ూూూూ ఫీ35 రెండు పవర్‌ఫుల్ మోడళ్లను పరిచయం చేసింది.50వీు అల్ట్రా-వైడ్ గ్రూప్ సెల్ఫీ కెమెరాముఖ్యంగా నేటి తరం యువత, సోషల్ మీడియా క్రియేటర్లు, ఫొటోగ్రఫీ ప్రేమికులను దృష్టిలో ఉంచుకుని కంపెనీ ఈ ఫోన్లను డిజైన్ చేసింది. ఇందులో 50 మెగాపిక్సెల్ అల్ట్రా-వైడ్ ఫ్రంట్ కెమెరాను అందించారు. ఇది 100 డిగ్రీల ఫీల్డ్ ఆఫ్ వ్యూని ఇస్తుంది. దీనివల్ల గ్రూప్ సెల్ఫీలు దిగినప్పుడు ఎవరూ కట్ అవ్వకుండా ఒకే ఫ్రేమ్‌లో పర్ఫెక్ట్‌గా ఫిట్ అవుతారు. ప్రో మోడల్‌లో ముందు, వెనుక కెమెరాలతో 4ఖ వీడియో రికార్డింగ్ సదుపాయం, ఆప్టికల్ ఇమేజ్ స్టెబిలైజేషన్ (ూ×ూ) సపోర్ట్ ఉంది.అద్భుతమైన డిస్‌ప్లే, ప్రాసెసర్‌ప్రీమియం మోడల్ అయిన ూూూూ ఫీఫ్రెష్ రేట్ కలిగిన ూమీూజుణ డిస్‌ప్లేను అందించారు. దీనివల్ల గేమింగ్, వీడియోగ్రాఫీ, స్క్రోలింగ్ అనుభవం ఎంతో మృదువుగా ఉంటుంది100 డిగ్రీల ఫీల్డ్ ఆఫ్ వ్యూని ఇస్తుంది. దీనివల్ల గ్రూప్ సెల్ఫీలు దిగినప్పుడు ఎవరూ కట్ అవ్వకుండ100 డిగ్రీల ఫీల్డ్ ఆఫ్ వ్యూని ఇస్తుంది. దీనివల్ల గ్రూప్ సెల్ఫీలు దిగినప్పుడు ఎవరూ కట్ అవ్వకుండా ఒకే ఫ్రేమ్‌లో పర్ఫెక్ట్‌గా ఫిట్ అవుతారు. ప్రో మోడల్‌లో ముందు, వెనుక కెమెరాలతో 4ఖ వీడియో రికార్డింగ్ సదుపాయం, ఆప్టికల్ ఇమేజ్ స్టెబిలైజేషన్ (ూ×ూ) సపోర్ట్ ఉంది.అద్భుతమైన డిస్‌ప్లే, ప్రాసెసర్‌ప్రీమియం మోడల్ అయిన ూూూూ ఫీఫ్రెష్ రేట్ కలిగిన ూమీూజుణ డిస్‌ప్లేను అందించారు. దీనివల్ల గేమింగ్, వీడియోగ్రాఫీ, స్క్రోలింగ్ అనుభవం ఎంతో మృదువుగా ఉంటుందా ఒకే ఫ్రేమ్‌లో పర్ఫెక్ట్‌గా ఫిట్ అవుతారు. ప్రో మోడల్‌లో ముందు, వెనుక కెమెరాలతో 4ఖ వీడియో రికార్డింగ్ సదుపాయం, ఆప్టికల్ ఇమేజ్ స్టెబిలైజేషన్ (ూ×ూ) సపోర్ట్ ఉంది.అద్భుతమైన డిస్‌ప్లే, ప్రాసెసర్‌ప్రీమియం మోడల్ అయిన

# రూ. 5 కోట్లు నష్టపోయిన టీమిండియా ప్లేయర్..!



సన్‌రైజర్స్ హైదరాబాద్ అభిమానులకు ఆసక్తికరమైన వార్త. జట్టు మాజీ పేసర్ టీ. నటరాజన్ మరోసారి సన్‌రైజర్స్ హైదరాబాద్ లోకి అడుగుపెట్టనున్నాడు. ఢిల్లీ క్యాపిటల్స్ తో జరిగిన ట్రేడ్‌లో భాగంగా నటరాజన్‌ను హైదరాబాద్ ఫ్రాంచైజీ తిరిగి తీసుకుంది. ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్, ఢిల్లీ క్యాపిటల్స్ తమ ఆటగాళ్లను ట్రేడ్ చేసుకున్నా యి. ఈ డీల్‌లో భాగంగా ఢిల్లీ బౌలర్ నటరాజన్ ూ=ఎలోకి రాగా.. ూ=ఎకు చెందిన లెగ్ స్పిన్నర్ అనారీ ఢిల్లీ జట్టులోకి వెళ్లినట్లు సమాచారం.2020 నుంచి 2024 వరకు ూ=ఎతో నటరాజన్‌నటరాజన్ గతంలో 2020 నుంచి 2024 వరకు సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టులో కొనసాగాడు. ఈ కాలంలో జట్టు బౌలింగ్ విభాగంలో కీలక పాత్ర పోషించాడు. ముఖ్యంగా 2024 సీజన్‌లో తన బౌలింగ్‌తో సత్తా చాటాడు. 2024 ఖూూ సీజన్‌లో 19 వికెట్లు తీసుకున్న నటరాజన్‌పై ఫ్రాంచైజీల ఆసక్తి పెరిగింది. ఆ తర్వాత జరిగిన 2025 వేలంలో ఢిల్లీ క్యాపిటల్స్ అతడిని రూ.10.75 కోట్లకు దక్కించుకుంది.రూ.10.75 కోట్ల నుంచి రూ.5 కోట్లకు..ఢిల్లీ క్యాపిటల్స్ కోసం ఆడిన తర్వాత ఇప్పుడు నటరాజన్ మళ్లీ తన పాత జట్టు ూ=ఎకు చేరుతున్నాడు. ఈసారి సన్‌రైజర్స్ అతడిని రూ.5 కోట్లకు తిరిగి తీసుకున్నట్లు సమాచారం. అంటే 2025 వేలంలో ఢిల్లీ చెల్లించిన రూ.10.75 కోట్లతో పోలిస్తే, ఇప్పుడు ూ=ఎ అతడిని తక్కువ మొత్తానికే జట్టులోకి తీసుకొచ్చింది. దీంతో హైదరాబాద్ ఫ్రాంచైజీ పాత ఆటగాడిపై మరోసారి నమ్మకం ఉంచినట్లు కనిపిస్తోంది.ూ=ఎ బౌలింగ్‌కు మరింత బలం?నటరాజన్ తిరిగి రావడం సన్‌రైజర్స్ హైదరాబాద్ బౌలింగ్ విభాగానికి ఉపయోగపడే అవకాశం ఉంది. గతంలో ూ=ఎ తరఫున ఆడిన అనుభవం కూడా అతడికి ఉంది. 2024లో 19 వికెట్లతో చూపించిన ప్రదర్శనను మళ్లీ కొనసాగిస్తే జట్టుకు కీలక బౌలర్‌గా మారే అవకాశం ఉంది.మరోవైపు ఈ ట్రేడ్‌తో ూ=ఎకు చెందిన లెగ్ స్పిన్నర్ అనారీ ఢిల్లీ క్యాపిటల్స్‌లోకి వెళ్లనున్నాడు. దీంతో రెండు ఫ్రాంచైజీలు తమ అవసరాలకు అనుగుణంగా ఆటగాళ్లను మార్చుకున్నాయి. సన్‌రైజర్స్ అభిమానులకు మాత్రం పాత పరిచయమైన నటరాజన్ మళ్లీ ఆరెంజ్ జెర్సీలో కనిపించనున్నాడనే వార్త ప్రత్యేక ఆకర్షణగా మారింది.

# ఈ 4 సంకేతాలు కనిపిస్తే జాగ్రత్త.




. ఎస్‌బీఐ హెచ్చరిక.. అవేంటో తెలుసా..? సోషల్ మీడియా, వాట్సాప్, టెక్స్ట్ మెసేజ్‌లు లేదా ఈమెయిల్‌ల ద్వారా మీకు నెలకు 30% రాబడి ఇస్తామన్న ఆఫర్లు వస్తుంటే జాగ్రత్తగా ఉండండి. ఇలాంటి ఆకర్షణీయమైన వాగ్దానాలు గణనీయమైన ఆర్థిక నష్టాలకు దారితీయవచ్చు. దేశంలోని అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకులలో ఒకటైన ఎస్‌బిఐ, మోసపూరిత పెట్టుబడి పథకాల గురించి పెట్టుబడిదారులను హెచ్చరించింది. త్వరితగతిన, అధిక లాభాలు ఇస్తామని ఆశ చూపి సైబర్ నేరగాళ్లు ప్రజల కష్టార్జితాన్ని దోచుకోగలరని ఆ బ్యాంకు పేర్కొంది. అందువల్ల ఏదైనా పెట్టుబడి ఆఫర్‌ను నమ్మే ముందు దాని ప్రామాణికతను ధృవీకరించుకోవడం చాలా ముఖ్యం. దీని గురించి వివరంగా తెలుసుకుందాం.ఎస్‌బీఐ ఎందుకు హెచ్చరిక జారీ చేసింది?

అక్టోబర్ 12న సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ శలో ఒక పోస్ట్ ద్వారా ఆన్‌లైన్ ఆర్థిక మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ూదీ× పెట్టుబడిదారులకు సూచించింది. ఈ సందేశం బ్యాంకు 'జాతీయ సైబర్ భద్రతా మాసోత్సవ ప్రత్యేక ప్రచారం 6.0'లో భాగంగా ఉంది . నెలకు 30% రాబడి వంటి వాగ్దానాలు మోసం కావచ్చని బ్యాంకు స్పష్టం చేసింది. మోసగాళ్లు తక్కువ సమయంలో ధనవంతులు కావాలనే కలలతో ప్రజలను ఆకర్షించి, ఆ తర్వాత పెట్టుబడి పేరుతో డబ్బు బదిలీ చేసేలా వారిని మోసం చేస్తారు. అటువంటి పరిస్థితిలో పెట్టుబడిదారులు తొందరపడకుండా ఆ ఆఫర్ విశ్వసనీయతను తనిఖీ చేసుకోవాలి.. విశ్వసనీయమైన ఆర్థిక మార్గాలను మాత్రమే ఉపయోగించాలి.సైబర్ నేరగాళ్లు ఎలా పనిచేస్తారు?

సైబర్ నేరగాళ్లు ప్రజలను వలలో వేయడానికి రకరకాల పద్ధతులను ఉపయోగిస్తారు. కొన్నిసార్లు వారు సోషల్ మీడియాలో ఆకర్షణీయమైన ప్రకటనలను ప్రదర్శిస్తారు, మరికొన్నిసార్లు గుర్తుతెలియని నంబర్ల నుండి పెట్టుబడి ఆఫర్లను అందిస్తూ సందేశాలు పంపుతారు. కొన్ని సందర్భాల్లో వారు నకిలీ వెబ్‌సైట్లు, మోసపూరిత పెట్టుబడి యాప్‌లు, కల్పిత కస్టమర్ రివ్యూల ద్వారా ప్రజల నమ్మకాన్ని పొందడానికి ప్రయత్నిస్తారని, ఇలాంటివి నమ్మితే

RNI NO.TGTEL/25/A5224
# జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం





## ఈ దసరాకి నా ఆయుధ పూజ వీటికే.. హీరోయిన్ నభా నటేష్ పోస్ట్ వైరల్

దేశవ్యాప్తంగా దసరా సంబరాలు అంబరాన్ని అంటుతున్నాయి. గత 9 రోజులుగా నవరాత్రి వేడుకలు వాడవాడలా ఘనంగా జరుగుతున్నాయి. అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి పూజలు నిర్వహిస్తున్నాయి. ఇక విజయదశమి పర్వదినం సందర్భంగా ఆయుధ పూజ నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది. సామాన్యులతో పాటు ప్రముఖులు కూడా ఆయుధ పూజ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో టాలీవుడ్ హీరోయిన్ నభా నటేష్ తన ఆయుధ పూజకు సంబంధించి షేర్ చేసిన ఒక పోస్ట్ ఇప్పుడు నెట్టింట వైరల్ గా మారింది. 2018లో వచ్చిన నన్నుదోచుకుందువటే సినిమాతో తెలుగు ఇండస్ట్రీలోకి అడుగు పెట్టింది నభా నటేష్. అంతకు ముందు కొన్ని కన్నడ సినిమాల్లో నటించిన ఆమె తెలుగు సినిమాలతోనే మంచి గుర్తింపు వచ్చింది. ముఖ్యంగా ఇస్మార్ట్ శంకర్ సినిమా నభా నటేష్ కు మంచి క్రేజ్, పాపులారిటీ తీసుకొచ్చింది. డిస్కో రాజా, సోలో బ్రతుకే సో బెటర్, అల్లుడు అదుర్స్, మ్యాస్ట్రో ఇలా పలు సినిమాల్లోనూ హీరోయిన్ గా చేసింది నభా. తనదైన అందం, అభినయంతో తెలుగు నాట తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చింది. అయితే హీరోయిన్ గా కెరీర్ ఫుల్ స్పీడ్ ఉంటున్న తరుణంలోనే నభాకు యాక్సిడెంట్ అయ్యింది. దీంతో చాలా నెలల పాటు మంచానికే పరిమితమైందీ అందాల తార.ఇక గతేడాదే డార్లింగ్ సినిమాతో రీ ఎంట్రీ ఇచ్చింది నభా నటేష్. అలాగే ఈ ఏడాది నాగబంధం అనే పాన్ ఇండియా మూవీలోనూ కథానాయికగా చేసింది. అయితే ఈ రెండు సినిమాలు పెద్దగా ఆడలేదు. ప్రస్తుతం నిఖిల్ సిద్ధార్థ్ సరసన స్వయంభు సినిమాలో నటిస్తోంది. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతోన్న ఈ సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. అలాగే కన్నడలోనూ ఓ సినిమా చేస్తోందీ ముద్దుగుమ్మ. సినిమాల సంగతి పక్కన పెడితే సోషల్ మీడియాలోనూ ఫుల్ యాక్టివ్ గా ఉంటుంది నభా నటేష్. తన సినిమాలు, షూటింగ్స్, ఇతర వ్యక్తిగత విషయాలను ఫాలోవర్లతో షేర్ చేసుకుంటుంది. అలా తాజాగా విజయదశమి ఆయుధ పూజను పురస్కరించుకుని నభా నటేష్ పెట్టిన పోస్ట్ సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతోంది. ఈ సందర్భంగా జిమ్‌లో వర్కవుట్స్ చేసే డంబెల్స్, ఇతర ఎక్విప్‌మెంట్‌తో ఉన్న ఫోటోను షేర్ చేసిన ఆమె.. హ్యాపీ ఆయుధ పూజ అని అభిమానులకు విషెస్ చెప్పింది. నా ఆయుధ పూజ వీటికే చేశాను అనే అర్థం వచ్చేలా ఉన్న ఈ



## రణబాలి 2’ పై క్రేజీ అప్డేట్.. స్టోరీ కూడా చెప్పేసిన డైరెక్టర్ రాహుల్

టాలీవుడ్ స్టార్ కపుల్ విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటించిన లేటెస్ట్ సినిమా రణబాలి.దసరా కానుకగా అక్టోబర్ 16న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా బ్లాక్ బస్టర్ టాక్ తో దూసుకుపోతోంది. తెలుగు తో పాటు ఇతర భాషల్లోనూ విజయ్- రష్మికల సినిమాకు మంచి రెస్పాన్స్ వస్తోంది. దసరా సెలవులు కావడంతో ఫ్యామిలీ ఆడియెన్స్ రణబాలి సినిమాను చూసేందుకు క్యూ కడుతున్నారు. దీంతో ఈ సినిమాకు రికార్డు కలెక్షన్లు వస్తున్నాయి. అటు ఓవర్సీస్ లోనూ విజయ్ సినిమాకు రికార్డు వసూళ్లు వస్తున్నాయని ట్రేడ్ నిపుణులు చెబుతున్నారు. ఇక బుక్ మై షోలోనూ గంటకు కనీసం 10వేల టికెట్లు బుక్ అవుతున్నాయి. 1878 కాలంలో రాయలసీమలో సంభవించిన కరువు, ప్రజల కష్టాలు, బ్రిటిష్ పాలకుల ఆగడాలను నేపథ్యంగా తీసుకుని దర్శకుడు రాహుల్ సాంకృత్యాన్ ఈ సినిమాను తెరకెక్కించాడు. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ భారీ బడ్జెట్ తో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఈ సినిమాను నిర్మించారు. హాలీవుడ్ స్టార్ నటుడు అర్నాల్డ్ వాస్లూ ఈ మూవీలో మెయిన్ విలన్ గా నటించడం విశేషం. అలాగే సీనియర్ నటి ఈశ్వరి రావు మరో కీలక పాత్రలో కనిపించారు. అజయ్ అతుల్ ఈ సినిమాకు సంగీతం అందించారు. ఇదిలా ఉంటే రణబాలి సినిమా మంచి సక్సెస్ కావడంతో ఈ సినిమాకు సీక్వెల్ ఉంటుందా? అంటూ ఎన్నో సందేహాలు వ్యక్తం అయ్యాయి ఈ నేపథ్యంలోనే డైరెక్టర్ రాహుల్ సాంకృత్యాన్ ఒక ఇంటర్వ్యూ సందర్భంగా రణబాలికి సీక్వెల్ కాకుండా ప్రీక్వెల్ ఉంటుందని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.‘ రణబాలి సినిమాకు ప్రీక్వెల్ తెరకెక్కించాలని నాకు ఎంతో ఆసక్తి ఉంది. రణబాలి తండ్రి, జయమ్మ, గౌడప్పల గత జీవిత కథల ఆధారంగా రణబాలి ప్రీక్వెల్ సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనుకుంటున్నాను. వారి జీవితాలను రణబాలి విధితో, అతని కొడుకు భవిష్యత్తుతో, పోర్టు నుంచి తప్పించుకున్న బ్రిటిష్ వ్యక్తితో ముడిపెడుతూ కథను రూపొందించాలని భావిస్తున్నాను’ అని చెప్పుకొచ్చారు డైరెక్టర్ రాహుల్. ప్రస్తుతం ఈ కామెంట్స్ నెట్టింట వైరల్ గా మారాయి. రణబాలి సినిమా ప్రీక్వెల్ వార్తలపై విజయ్- రష్మికల ఫ్యాన్స్ హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే రణబాలి 2 రావడానికి చాలా సమయం పట్టనుందని తెలుస్తోంది. ఎందుకంటే ప్రస్తుతం విజయ్- రష్మికలు పలు సినిమాలకు కమిట్ అయి ఉన్నారు. ఈ సినిమా పనులు పూర్తి అయిన తర్వాతనే రణబాలి ప్రీక్వెల్ ఉండవచ్చని తెలుస్తోంది.



## పెళ్లి పీటలెక్కనున్న మెగా మేనల్లుడు

మెగా మేనల్లుడిగా సినిమా ఇండస్ట్రీలోకి అడుగు పెట్టాడు సాయి దుర్గతేజ్. తనదైన యాక్టింగ్, స్టైల్, డ్యాన్స్ లతో సుప్రీం హీరోగా తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు. మధ్యలో రోడ్డు ప్రమాదం కారణంగా కెరీర్ లో కొంచెం వెనకపడినా రీఎంట్రీలో విరూపాక్ష సినిమాతో ఏకంగా వంద కోట్ల క్లబ్ లో చేరాడీ ట్యాలెంటెడ్ హీరో. అలాగే పవన్ కల్యాణ్ తో కలిసి నటించిన బ్రో సినిమాతోనూ బ్లాక్ బస్టర్ అందుకున్నాడు. సినిమాల సంగతి పక్కన పెడితే.. తెలుగు సినీ ఇండస్ట్రీలో మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్స్ లో సాయి ఒకరని చెప్పవచ్చు. చాలా సార్లు ఆయన పెళ్లి గురించి వార్తలు వచ్చినా అవన్నీ రూమర్లు గానే మిగిలిపోయాయి. అయితే ఇప్పుడు ఎట్టకేలకు ఈ మెగా మేనల్లుడు ఒక ఇంటివాడు కాబోతున్నాడని తెలుస్తోంది. త్వరలోనే ఈ సుప్రీం హీరో కూడా పెళ్లిపీటలెక్కనున్నట్లు టాక్. తన చిన్ననాటి స్నేహితురాలిని సాయి దుర్గతేజ్ వివాహం చేసుకోబోతున్నట్లు టాక్ .నవంబర్ 5వ తేదీన కుటుంబ సభ్యులు, సన్నిహితులు, స్నేహితుల మధ్య ఘనంగా నిశ్చితార్థం జరుపుకోబోతున్నట్లు సమాచారం. ఈ మేరకు ఇరు కుటుంబాల మధ్య చర్చలు కూడా ముగిసాయని, నిశ్చితార్థమైన రెండు నెలలోపే వివాహం కూడా జరిపించాలని ఇరు కుటుంబ సభ్యులు నిర్ణయించుకున్నట్లు వార్తలు వస్తున్నాయి.అయితే సాయి దుర్గతేజ్ ఎంగేజ్మెంట్, పెళ్లి వార్తలపై అటు హీరో ఫ్యామిలీ కానీ, మెగా కుటుంబ సభ్యులు కానీ ఇంకా అధికారికంగా స్పందించలేదు. కానీ ఈ మెగా మేనల్లుడి పెళ్లి వార్తలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో హాట్ టాపిక్ గా మారాయి. బ్యాచిలర్ లైఫ్ ను వీడి వైవాహిక బంధం లోకి అడుగుపెట్టబోతున్నట్లు వార్తలు వస్తుండడంతో మెగాభిమానులు తెగ సంబరపడిపతున్నారు. సాయి పెళ్లిపై అఫీషియల్ అనౌన్స్మెంట్ ఇవ్వాలని కూడా మెగాభిమానులు కోరుతున్నారు.

ఇక సినిమాల విషయానికి వస్తే.. ప్రస్తుతం సంబరాల ఏటి గట్టు అనే పాన్ ఇండియా సినిమాలో నటిస్తున్నాడు సాయి దుర్గతేజ్. డైరెక్టర్ రోహిత్ కేపీ తెరకెక్కిస్తోన్న ఈ పీరియాడికల్ యాక్షన్ థ్రిల్లర్ లో ఐశ్వర్య లక్ష్మి హీరోయిన్ గా నటిస్తోంది. అలాగే ప్రముఖ కన్నడ నటుడు ధనుంజయ కీలక పాత్ర పోషిస్తున్నారు. వీరితో పాటు జగపతిబాబు,

## ఎట్టకేలకు విడుదలకు సిద్ధమైన వెంకీ




త్రివిక్రమ్ మూవీ.. కొత్త రిలీజ్ డేట్ ఇదే

టాలీవుడ్‌లో విక్టరీ వెంకటేష్‌కు ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ సినిమాలతో ప్రేక్షకులను అలరించడంలో ఆయనది ప్రత్యేకమైన శైలి. మరోవైపు, తనదైన మాటలు, కథాకథనం, వినోదంతో ప్రేక్షకులను ఆకట్టుకునే దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్. ఈ ఇద్దరి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న తాజా చిత్రం ‘ఆదర్శ కుటుంబం: హౌస్ నెం. 47’ కోసం సినీ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. పలుమార్లు వాయిదా పడిన ఈ సినిమా ఎట్టకేలకు అక్టోబర్ 30న ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా ఈ సినిమా రిలీజ్ డేట్ ను వెంకటేష్ సోషల్ మీడియా వేదికగా అనౌన్స్ చేశారు. వెంకటేష్, త్రివిక్రమ్ కాంబినేషన్‌లో వస్తున్న ఈ సినిమాపై మొదటి నుంచే మంచి అంచనాలు నెలకొన్నాయి. తొలుత ఈ చిత్రాన్ని అక్టోబర్ 2న విడుదల చేయాలని మేకర్స్ భావించారు. ఆ తర్వాత అక్టోబర్ 9కు వాయిదా వేశారు. అయితే అనుకున్న సమయానికి సినిమా థియేటర్లలోకి రాకపోవడంతో అభిమానులు నిరాశకు గురయ్యారు.సినిమాకు సంబందించిన కొన్ని పనులు , టెక్నికల్ వర్క్ సంబంధించిన అంశాల కారణంగా విడుదలను మరోసారి వాయిదా వేశారు. ఫైనల్ గా ఈ సినిమాను అక్టోబర్ 30న విడుదల చేసేందుకు చిత్రబృందం సిద్ధమైంది. వరుస వాయిదాలతో ఎదురుచూస్తున్న అభిమానులకు ఈ వార్త ఊరటనిస్తోంది. వెంకటేష్, త్రివిక్రమ్ గతంలో రచయితగా వచ్చిన సినిమాలు ప్రేక్షకులను అలరించినప్పటికీ, దర్శకుడిగా త్రివిక్రమ్‌తో వెంకటేష్ చేస్తున్న ఈ చిత్రం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. కుటుంబ కథలు, వినోదాత్మక సన్నివేశాలు, భావోద్వేగాలను తెరపై అద్భుతంగా చూపించడంలో వెంకటేష్‌కు మంచి పేరుంది. త్రివిక్రమ్ తనదైన సంభాషణలు, కథనంతో ఈ సినిమాను ఎలా తీర్చిదిద్దారనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది.



## మూడేళ్లు ఆ డైరెక్టర్ ఇంటి చుట్టూ తిరిగా.. నెలకు రూ.50 వేల జాబ్ కూడా వదిలేసా..

సినిమా రంగంలో సక్సెస్ సాధించిన ప్రతి దర్శకుడి వెనుకా ఒక ఆసక్తికరమైన ప్రయాణం ఉంటుంది. తెరపై కనిపించే పేరు, క్రేజ్ రావడానికి ముందు ఎన్నో అవమానాలు, ఎదురుచూపులు, రిజెక్షన్స్ ఎదుర్కొన్నవాళ్లు చాలామందే ఉన్నారు. అలాంటి కష్టాల నుంచి దర్శకుడిగా ఎదిగిన వారిలో శ్రీకాంత్ ఓదెల ఒకరు. దసరా, ది ప్యారడైజ్ వంటి చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆయన.. ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన రోజులను తాజాగా ఓ ఇంటర్వ్యూలో గుర్తుచేసుకున్నారు. శ్రీకాంత్ ఓదెలకు చిన్నప్పటి నుంచే సినిమా అంటే ఆసక్తి. అయితే దర్శకుడిగా మారాలనే లక్ష్యంతో ఆయన వేసిన తొలి అడుగులు అంత సులభంగా సాగలేదు. ముఖ్యంగా తనకు ఎంతో ఇష్టమైన దర్శకుడు సుకుమార్ దగ్గర అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేయాలనే కోరికను నెరవేర్చుకోవడానికి చాలా కాలం ప్రయత్నించారట.ఇంటర్మీడియట్ చదువుతున్న సమయంలో శేషు అనే లెక్చరర్ ద్వారా సుకుమార్‌తో పరిచయం ఏర్పడే అవకాశం లభించిందని శ్రీకాంత్ తెలిపారు. ఆ పరిచయాన్ని ఉపయోగించుకుని సుకుమార్ టీమ్‌లో చేరేందుకు ప్రయత్నించినప్పటికీ అప్పట్లో అవకాశం దక్కలేదట. ‘ఆర్య 2’ తర్వాత అన్నపూర్ణ స్టూడియోలో సుకుమార్‌ను కలిసినట్లు శ్రీకాంత్ వెల్లడించారు. అప్పటి నుంచి ఆయన దగ్గర పనిచేయాలనే పట్టుదల మరింత పెరిగిందట. అవకాశం కోసం ఏకంగా మూడేళ్ల పాటు సుకుమార్ ఇంటి చుట్టూ తిరిగినట్లు చెప్పారు.రోజూ ఉదయం అపార్ట్‌మెంట్ దగ్గరకు వెళ్లి సుకుమార్‌ను



## ఆరోవారం ఓటింగ్‌లో దుమ్మురేపుతోన్న రోహిత్.. డేంజర్ జోన్‌లో ఆ ఇద్దరు..

బిగ్ బాస్ ఇంట్లో మూడో వారం కెప్టెన్సీ కంటెండర్ టాస్కులు ఆసక్తికరంగా సాగుతున్నాయి. కంటెస్టెంట్ల మధ్య పోటీ, గొడవలు, భావోద్వేగాలు ఒకవైపు కొనసాగుతుండగా.. మరోవైపు ఇంటి సభ్యుల ఆటతీరుపై బయట ప్రేక్షకుల్లో ఉన్న అభిప్రాయాలను బిగ్ బాస్ స్క్రీన్‌పై చూపించడం హాట్ టాపిక్‌గా మారింది. ముఖ్యంగా షాలినీ, రాం ప్రసాద్, త్రిగుణ్, వర్షిణి, సుధీర్‌లపై వచ్చిన కామెంట్లు ఇంట్లో చర్చకు దారితీశాయి. కెప్టెన్సీ కంటెండర్ టాస్కుల్లో భాగంగా రెండు బజర్‌లను ముందుగా ఎవరు టచ్ చేశారనే దానిపై నరేష్, వంశీ మధ్య వివాదం తలెత్తింది. ఈ విషయాన్ని తేల్చే బాధ్యత త్రిగుణ్‌పై పడింది. మొదట నరేష్ ముందుగా బజర్ పట్టుకున్నాడని చెప్పిన త్రిగుణ్.. ఆ తర్వాత తన నిర్ణయాన్ని మార్చుకున్నాడు. చివరకు వంశీనే ముందుగా బజర్ టచ్ చేశాడని ప్రకటించాడు. ఒకవేళ తన నిర్ణయం తప్పయితే దానికి తానే బాధ్యత వహించి పనిష్మెంట్ తీసుకుంటానని త్రిగుణ్ చెప్పడం ఆసక్తికరంగా మారింది.

మరో టాస్క్‌లో వంశీ, ఝాన్సీ పోటీ పడగా.. ఝాన్సీ విజయం సాధించింది. దీంతో ఆమెకు కెప్టెన్సీ కంటెండర్‌గా నిలిచే అవకాశం రావడంతో పాటు ఫ్యామిలీ ఫోటోను పొందే ఛాన్స్ కూడా దక్కింది. అయితే తనకు లభించిన ఆప్షన్స్‌లో నరేష్‌కు సంబంధించిన లెటర్‌ను ఎంచుకున్న ఝాన్సీ.. దాన్ని ముక్కలు చేయడంతో నరేష్‌కు టెన్షన్ మొదలైంది. తర్వాత కంటెస్టెంట్లకు కాస్త రిలీఫ్ ఇచ్చేలా గార్డెన్ ఏరియాలోకి బిగ్ బాస్ భారీగా ఫుడ్ పంపించాడు. ఇంటి సభ్యులంతా కలిసి ఫుడ్‌ను ఎంజాయ్ చేశారు. కానీ ఆ ఆనందం

Printed, published &owned. By ravula rajesham printed at. JORDAR publication H.NO.2-5_146 . jammikunta.dist. karimnagar Telangana state 505122..editor.ravula rajesham, email. editor jordar@gmail.com. cellphone 7780185674 PRGi numberTG TEL/25/A5224